ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -82 పేజీలు - 8 వెల - 03/- శనివారం 11 జులై 2026

# వైసీపీ నేతల ట్రాప్‌లో పడొద్దు

**వైసీపీ నేతలు వికృత శైలిని ఎంచుకున్నారు.. : కేబినెట్ సమావేశంలో చంద్రబాబు**

**చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశం**

**సోషల్ మీడియాలో అభ్యంతరకర వీడియోలు, పోస్టులపై మంత్రుల ఆగ్రహం**

**కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశం**

**అమరావతి, జూలై, 10 (రిపబ్లిక్ న్యూస్):** ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలి సమావేశంలో సోషల్ మీడియా వేదికగా సాగుతున్న అసత్య ప్రచారాలపై సుదీర్ఘమైన చర్చ జరిగింది. డిజిటల్ వేదికల్లో ప్రభుత్వంపై, కూటమి నేతలపై వస్తున్న అభ్యంతరకర వీడియోలు, పోస్టులపై సమావేశంలో మంత్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.**మిగతాది 2లో...**






## రూ.9,355 కోట్లతో తాగునీటి పథకాలు

**10 భారీ మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌ల ఏర్పాటు**

**నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల కోసం రూ.1,811 కోట్లు**

**2,943 తాగునీటి పథకాలకు అనుమతులు మంజూరు**

**పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణ**

**కేబినేట్ భేటీలో 30కి పైగా అంశాలకు కేబినేట్ ఆమోదం**

**2లో.**

# పండించిన ప్రతి గింజను కొంటున్నాం



**గతంలో రైతుబంధు కోసం తిప్పించుకున్నారు**

**రెండున్నర ఏళ్లలోనే మహిళలకు రూ. 67,000 కోట్ల రుణాలు**

**రైతు ఆశీర్వాద సభలో డిప్యూటి సిఎం భట్టి**

**ఖమ్మం, జూలై, 10 (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలోని రైతులకు పెట్టుబడి సాయం అందించే క్రమంలో ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రైతు భరోసా పథకం కింద నూతనంగా రూ. 1,009 కోట్ల నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయగా, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. గత ప్రభుత్వం రైతు బంధు నిధుల కోసం 169 రోజులు తిప్పించుకునేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లు ఇచ్చిందని**మిగతాది 2లో...**



# పవన్‌ను లక్ష్యంగా చేసుకుని కుట్ర

**జడా శ్రావణ్, ప్రకాశ్ రాజ్, రావణ్ కుట్ర అంటూ మంత్రి దుర్గేశ్ ఫైర్**

**వీరి వెనుక వైసీపీ, తాడేపల్లి స్క్రిప్ట్ ఉందని కందుల దుర్గేశ్ ఆరోపణ**

**ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకే మత ఘర్షణలు రెచ్చగొడుతున్నారని ఫైర్**

**ప్రశ్నించడం అంటే బూతులు తిట్టడమేనా అని తీవ్ర విమర్శ**

**అమరావతి, జూలై, 10 (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వైసీపీ భారీ కుట్రకు తెరలేపిందని, అందులో భాగంగానే జడా శ్రావణ్ కుమార్, నటుడు ప్రకాశ్ రాజ్, యూట్యూబర్ జోసెఫ్ రావణ్ పనిచేస్తున్నారని రాష్ట్ర మంత్రి, జనసేన నేత కందుల దుర్గేశ్ సంచలన ఆరోపణలు చేశారు. **మిగతాది 2లో...**

# సద్దుమణిగిన మధ్యప్రాచ్యం

**టెహ్రాన్‌కు ఖతార్ ప్రతినిధులుచర్చలకు వాషింగ్టన్ కట్టుబడి ఉంది**

**సాంకేతిక అంశాలపై భేటీ : అమెరికా**

**ఇరాన్‌తో చర్చలు జరపాలంటున్న మిడిల్ ఈస్ట్ దేశాలు**

**టెహ్రాన్ :** అమెరికా, ఇరాన్‌ల మధ్య రెండు రోజుల పాటు జరిగిన తీవ్ర దాడుల అనంతరం మధ్యప్రాచ్యంలో తుపాకుల మోత ఆగిపోయింది. దౌత్య సంబంధాలను తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నంలో భాగంగా ఖతార్ ప్రతినిధులు టెహ్రాన్‌కు వెళ్లినట్టు సమాచారం. టెహ్రాన్‌తో చర్చలకు వాషింగ్టన్**మిగతాది 2లో...**



# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం..

**సమాజానికి నష్టం కలిగించేలా తయారైన రోగం**

**అసత్యాలతో రాజకీయ బురదజల్లుతున్న ప్రచారం**

**ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చే ఆలోచన**

**ప్రపంచ వ్యాప్తంగా కఠిన చర్యలు అమలుపై అధ్యయనం**

**కేబినేట్ నిర్ణాయాలను వివరించిన మంత్రి పార్థసారథి**

**అమరావతి, జూలై, 10 (రిపబ్లిక్ న్యూస్):**
సోషల్ మీడియా వల్ల సమాజానికి ఉపయోగంతో పాటు తీవ్ర నష్టం కలిగించే 'రోగంగా' మారుతోందని ఏపి కేబినెట్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేబినేట్ వివరాలనురాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కె. పార్థసారథి తెలిపారు.**మిగతాది 2లో...**




# బెంచ్‌పైకి కాగితాలు విసిరి..

## సుప్రీంకోర్టులో పిటిషనర్ వీరంగం...

**సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా పిటిషనర్ తీవ్ర గందరగోళం**

**న్యాయమూర్తులపైకి కేసు పత్రాలు విసిరికొట్టిన వ్యక్తి**

**అదుపులోకి తీసుకుని బయటకు పంపిన భద్రతా సిబ్బంది**



**ఢిల్లీ జూలై, 10 (రిపబ్లిక్ న్యూస్):**
దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో శుక్రవారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒక కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ హద్దులు మీరు ప్రవర్తించాడు. న్యాయమూర్తులపై దూషణలకు దిగడమే కాకుండా, కేసు **మిగతాది 2లో...**



# తెలంగాణ జనసేనలో జోష్..

## పవన్ సమక్షంలో పార్టీలోకి భారీగా చేరికలు

**పార్టీలో చేరిన తెలంగాణ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రవీందర్**

**హైదరాబాద్ జూలై, 10 (రిపబ్లిక్ న్యూస్):**
తెలంగాణలో పార్టీ బలోపేతం దిశగా జనసేన పార్టీ కీలక అడుగులు వేస్తోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రాజకీయ, విద్య, కార్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.
జనసేనలో చేరిన వారిలో తెలంగాణ యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్, ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి. రవీందర్ ముఖ్యులు**మిగతాది 2లో...**

# అమరావతికి 'శాంసంగ్ సిటీ'..

## కొరియా కంపెనీలతో మంత్రి లోకేశ్ కీలక భేటీలు

**దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేశ్**

**ఏపీలో బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు డెల్టా ఎక్స్‌కు ఆహ్వానం**

**త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామన్న డెల్టా ఎక్స్ సీఈవో**

**అమరావతిలో 'శాంసంగ్ సిటీ'కి లోకేశ్ ప్రతిపాదన**

**ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామన్న శాంసంగ్ ప్రతినిధులు**

**అమరావతి, జూలై, 10 (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్‌ను అత్యాధునిక సాంకేతికత, పారిశ్రామిక పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ కొరియా పర్యటనలో **మిగతాది 2లో...**





# వైసీపీ నేతల ట్రాప్‌లో పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

భావ ప్రకటన స్వేచ్ఛను గౌరవిస్తూనే.. హద్దులు మీరి అసత్యాలు వక్రీకరిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను మంత్రిమండలి ఆదేశించింది. సోషల్ మీడియా సైబర్ నేరాల నియంత్రణకు వెంటనే ఒక ప్రత్యేక 'టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేయాలని, అవసరమైతే నిపుణులను బయటి నుంచి తీసుకోవాలని సూచించింది. అంతేకాకుండా, ఈ కేసులలో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కొత్తగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించుకోవాలని స్పష్టం చేసింది. ఈ కార్యాచరణపై ఇప్పటికే ఉన్న కేబినెట్ సబ్ కమిటీలోనూ చర్చించనున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ నేతలు ఈ సరికొత్త వికృత ప్రచార శైలిని ఎంచుకున్నారని ఈ సందర్భంగా చంద్రబాబు మంత్రులకు వివరించారు. "వారు కావాలనే ఎమ్మెల్యేలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారి ట్రాప్‌లో పడొద్దు. సంయమనం పాటించండి" అని సూచించారు. అనంతపురం సహా పలు జిల్లాల్లో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలను ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. ప్రతికూల ప్రచారాలను తిప్పికొడుతూ... ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనదేనన్నారు. జిల్లాల పర్యటనలకు వెళ్లే ఇన్‌ఛార్జ్ మంత్రులు స్థానిక ఎమ్మెల్యేలతో పూర్తిస్థాయిలో సమన్వయం చేసుకోవాలని, రెవెన్యూతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు.

# రూ.9,355 కోట్లతో తాగునీటి పథకాలు

**10 భారీ మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌ల ఏర్పాటు**

**నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల కోసం రూ.1,811 కోట్లు**

**2,943 తాగునీటి పథకాలకు అనుమతులు మంజూరు**

**పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణ**

**కేబినేట్ భేటీలో 30కి పైగా అంశాలకు కేబినేట్ ఆమోదం**



**అమరావతి,అమరావతి, జూలై, 10 (రిపబ్లిక్ న్యూస్)::**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దాదాపు 30కి పైగా కీలక అజెండా అంశాలకు ఆమోదం లభించింది. వాటిలో ముఖ్యంగా.. మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ చేపట్టాలని నిర్ణయించారు. గ్రామాల్లో రూ.9,355 కోట్లతో 10 భారీ మల్టీ విలేజ్ తాగునీటి పథకాల మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల కోసం రూ.1,811 కోట్లతో 2,943 తాగునీటి పథకాలకు అనుమతులు మంజూరు చేశారు. పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణతో పాటు, కుప్పంలో ఫీడర్ ఛానెల్స్, బీరగానిపల్లె రిజర్వాయర్ పనులకు కేబినెట్ ఆమోదం లభించింది. భూసమీకరణ నిర్ణయాలు.. అమరావతిలో రెండో విడత కింద భూములిచ్చే 7 గ్రామాల రైతులకు రూ.లక్షన్నర వరకు సాగు రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. 2026 జనవరి 6 కంటే ముందు తీసుకున్న రుణాలకు మాత్రమే ఈ మాఫీ వర్తిస్తుంది. భూములిచ్చిన, ఇవ్వబోయే రైతులకు ఏటా మెట్ట భూములకు రూ.3 వేలు, జరీబు భూములకు రూ.5 వేల చొప్పున కౌలు పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీనితో మొత్తం కౌలు మెట్ట రైతులకు రూ.40 వేలకు, జరీబు రైతులకు రూ.60 వేలకు చేరనుంది. రెండో విడత భూసమీకరణ పరిధిలోని 307 ఎకరాల ఇనాం భూములకు గానూ దేవదాయశాఖకు రూ.159 కోట్ల పరిహారం చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. సీఆర్డీఏ ఆమోదించిన సంస్థలకు, ఎన్ఎఫ్‌డీబీ భారీ అక్వేరియం-కార్యాలయానికి, అలాగే ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ సంస్థలకు భూకేటాయింపులు జరపనున్నారు. నెల్లూరులో ఐటిసి హోటల్, కడపలో మాధవి హోటల్, విజయవాడలో సరోవర్ పోర్టికో హోటల్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలను ఆమోదించారు. కడపలో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్మెంట్ పార్కు ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కొత్త పర్యాటక పాలసీలో భాగంగా రాష్ట్రంలో భారీ కాన్సర్ట్ (సంగీత/సాంస్కృతిక ప్రదర్శనలు)ల నిర్వహణకు ప్రత్యేక విధానాన్ని ప్రతిపాదించారు. పర్యాటక ప్రచారానికి రూ.50 కోట్లు కేటాయించారు. ఎస్ఐపీబీ సిఫార్సుల మేరకు రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు. తిరుపతి జిల్లాలో 63 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుపై చర్చించారు. విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో 'అంబేద్కర్ గురుకుల సీవోఈ ' ల ఏర్పాటుకు ఆమోదం లభించింది. విద్యార్థులకు ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షల కొరకు రెసిడెన్షియల్ కోచింగ్ ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఓకే చెప్పింది. విశాఖపట్నంలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ఆమోదం లభించింది.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం..

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియా ప్రభావంతో ప్రజల ఆలోచనా విధానం, పాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని కేబినెట్‌లో చర్చ జరిగిందని చెప్పారు. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం వివరాలను మంత్రి పార్థసారథి విలేకర్ల సమావేశంలో వివరించారు.

విద్వేష ప్రచారం, వ్యక్తిత్వ హననం చేసే సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను గుర్తించేందుకు ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చాలని ఈ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై అన్ని ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సీఎం సూచించారని పేర్కొన్నారు. సైబర్ ఇన్వెస్టిగేషన్‌లో నైపుణ్యం కలిగిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను అవసరమైతే నియమించాలని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాలు సోషల్ మీడియా నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయన్న అంశంపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. సంప్రదాయ మీడియాకు ఉన్న జవాబుదారీతనం, నైతిక విలువలు సోషల్ మీడియాలో కనిపించడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం, అసత్య సమాచారం పెరుగుతోందని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాను రాజకీయ ప్రత్యర్థులపై దాడులు, అసత్య ప్రచారం కోసం కొందరు దుర్వినియోగం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇటువంటి కార్యకలాపాలకు కొన్ని రాజకీయ పార్టీలు కూడా ఆర్థిక సహకారం అందిస్తున్నాయని విమర్శించారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై డీజీపీ, పోలీసు అధికారులు క్యాబినెట్‌కు సమగ్ర నివేదిక సమర్పించారని పేర్కొన్నారు. విదేశాల్లో అమలులో ఉన్న సోషల్ మీడియా చట్టాలు, భారత ఐటీ చట్టంలోని లోపాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు వివరించారు. మహిళలను, బాలికలను కించపరిచే పోస్టులు, వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని ప్రభుత్వం సహించదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారని తెలిపారు.

సోషల్ మీడియా దుర్వినియోగంపై చట్టాలను మరింత బలోపేతం చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారని చెప్పారు. రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సోషల్ మీడియా దుర్వినియోగం, ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. సోషల్ మీడియా దుర్వినియోగ నియంత్రణపై దేశ, విదేశాల్లో అమలులో ఉన్న ఉత్తమ విధానాలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఓఎం) అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

# సద్దుమణిగిన మధ్యప్రాచ్యం

(మొదటి పేజీ తరువాయి)

కట్టుబడి ఉందని, సాంకేతిక చర్చలు కొనసాగుతున్నాయని ఓ అమెరికా అధికారి తెలిపారు. కాగా అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడులు, ప్రతిదాడుల కారణంగా హోర్ముజ్ జలసంధిలో నౌకాయానం తీవ్రంగా పడిపోయింది. చరిత్రలోనే అతిపెద్ద సరఫరా అంతరాయంతో ఇప్పటికే కుదేలైన ఇంధన మార్కెట్లకు ఇది మరో దెబ్బగా మారింది. తాజా పరిణామాల నేపథ్యంలో అమెరికా తమ దాడులను నిలిపివేసినట్టు ప్రకటించింది. అయితే ఓ వైపు చాబహార్ పోర్టుపై దాడులు జరిగాక.. తాము చేయలేదని ట్రంప్ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. దీంతో ఈ విషయంలో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ ఖననానికి ఇరాన్ సిద్ధమవుతున్న తరుణంలో గురువారం ఈ దాడులు మొదలయ్యాయి. అవి దక్షిణ ఇరాన్‌లోని పలు ప్రాంతాలపై జరిగాయి.

ఈ దాడులకు ఇరాన్ నేరుగా ఎవరినీ నిందించలేదు. అయినప్పటికీ ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా చేస్తున్న ప్రచారానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) మద్దతు ఇస్తోందని ఒక చట్టసభ సభ్యుడు హెచ్చరించారు. అయితే ఓవైపు ఖమేనీ అంత్యక్రియలు జరుగుతున్నప్పటి నుంచే ట్రంప్ వివాదాస్పద ప్రకటనలు చేశారు. ఇరాన్‌పై భీకరపోరు తప్పదని హెచ్చరికలు చేసిన విషయం విదితమే. ఆ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ఇరాన్‌పై మళ్లీ దాడులు జరిగాయి. దేశంలోని బుషెహర్, సిస్తాన్-బలూచిస్తాన్ ,ప్రావిన్సులు, అహ్వాజ్ , చాబహార్ నగరాలు, ఇంకా ఇతర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పలు వైమానిక దాడులు , పేలుళ్లు జరిగినట్టు ఇరాన్ వార్తా సంస్థలు , ప్రభుత్వ మీడియా నివేదించాయి. భారత్ నిర్వహణలో ఉన్న చాబహార్ పోర్టుపై క్షిపణుల దాడి వెనుక అమెరికా, ఇజ్రాయిల్ ఉన్నాయా? అన్న అంశం ఇంకా తేలలేదు. మరోవైపు ఈ దాడులపై సెంట్రల్ కమాండ్ కూడా స్పందించలేదు. ఏకంగా 80 స్థానాలపై అమెరికా విరుచుకుపడితే.. ఇటు ఇరాన్ కూడా తగ్గలేదు. అంతే దీటుగా స్పందించింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై క్షిపణులతో దాడులకు దిగింది. తాము దాడులకు పాల్పడలేదని ట్రంప్ మరో సారి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అయితే ఇరాన్‌లో ఈ దాడులు ఎవరు చేశారనే ప్రశ్న ఇంకా మిగిలే ఉంది. గురువారం జరిగిన దాడులకు ప్రతిస్పందనగా, అంతకుముందు ఇరాన్ మధ్యప్రాచ్యంలో బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్‌లను లక్ష్యంగా చేసుకుని అనేక దాడులు చేసింది. ఇరాన్ దాడి జరిగిన వెంటనే, యూఏఈ నాయకుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్.. కువైట్ పాలకుడిని కలవడానికి ఆ దేశానికి వెళ్లారు.

గల్ఫ్ అరబ్ దేశాలు కూడా ఖతార్ విదేశాంగ మంత్రితో చర్చలు జరిపాయి. ఇరాన్‌పై జరిగిన దాడులకు ఇజ్రాయిల్ సాధారణంగా వెంటనే బాధ్యత తీసుకుంటుంది. తాజా దాడుల నేపథ్యంలో ఇజ్రాయిల్ నుంచి ఎలాంటి ప్రకటనా రాకపోవడం గమనార్హం. గురువారం రాత్రి నెతన్యాహు ట్రంప్‌తో మాట్లాడారని, గల్ఫ్‌లో అమెరికా చర్యల గురించి ట్రంప్ ఆయనకు వివరించారని ఇజ్రాయిల్ ప్రభుత్వం తెలిపింది. అవసరమైతే ఇరాన్‌ను ఎదుర్కోవడానికి తమ దేశం సిద్ధంగా ఉందని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కాట్జ్ కూడా తన హెచ్చరికను పునరుద్ఘాటించారు. ఒక సైనిక కార్యక్రమంలో కాట్జ్ మాట్లాడుతూ.. "కార్యకలాపాలను పునఃప్రారంభించడానికి, గగనతల ఆధిపత్యాన్ని తిరిగి పొందడానికి, ముప్పులను తొలగించడానికి, అవసరమైతే మూడోసారి అయినా ఇరాన్‌పై 'నీలి-తెలుపు' (ఇజ్రాయిల్) దాడిని ప్రారంభించడానికి ఇజ్రాయిల్ సైన్యం అప్రమత్తంగా , సిద్ధంగా ఉంది" అని అన్నారు. "మేము తిరిగి రావాల్సి వస్తే, మరింత పెద్ద బలంతో తిరిగి వస్తాము" అని ఆయన చెప్పారు. హోర్ముజ్ జలసంధి నౌకాయానానికి తెరిచి, స్వేచ్ఛగా ఉండాలని అరబ్ దేశాలు, అమెరికా పట్టుబ డుతున్న సమయంలో ఈ దాడులు జరిగాయి. ఆ జలసంధిపై తమకు పూర్తి నియం త్రణ ఉండాలని , నౌకలు టెహ్రాన్‌కు రుసుములు చెల్లించడం ప్రారంభించాలని ఇరాన్ అంటోంది.

# తెలంగాణ జనసేనలో జోష్..

(మొదటి పేజీ తరువాయి)

వీరితో పాటు ప్రజారాజ్యం పార్టీ మాజీ నేత, నిజామాబాద్‌కు చెందిన మీసాల శ్రీనివాస్ రావు, ట్రేడ్ యూనియన్ నేత దేవరకొండ రామ్మోహన్ రావు, హైకోర్టు న్యాయవాది మైదంశెట్టి రవివర్మ, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బి. రవీందర్ గౌడ్ తదితరులు పార్టీలో చేరారు. వీరితో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు బత్తిని సత్యనారాయణ గౌడ్, ఆరే మహేందర్, వైద్య రంగ నిపుణులు డాక్టర్ బండారు రాజ్‌కుమార్, డాక్టర్ ఎడ్ల సాయి కృష్ణప్రియ కూడా జనసేనలో చేరారు. పవన్ కల్యాణ్ నాయకత్వం, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు.

త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు, 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్ఠం చేసే వ్యూహంలో భాగంగా ఈ చేరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షుడు బి. మహేందర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బెంచ్‌పైకి కాగితాలు విసిరి..

(మొదటి పేజీ తరువాయి)

పత్రాలను వారి వైపు విసిరికొట్టి తీవ్ర గందరగోళం సృష్టించాడు. తక్షణమే అప్రమత్తమైన భద్రతా అధికారులు అతడిని కోర్టు హాలు నుంచి బలవంతంగా బయటకు పంపించారు. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రబల్ ప్రతాప్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఎదుట ఆయన స్వయంగా వాదనలు వినిపించాడు. అయితే, విచారణ ప్రారంభంలోనే పిటిషనర్ న్యాయమూర్తులను 'జ్యుడీషియల్ సర్వెంట్' అని సంబోధిస్తూ, 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను మిమ్మల్ని ఆదేశిస్తున్నాను' అని వ్యాఖ్యానించాడు. దీనిపై తీవ్ర విస్మయం వ్యక్తం చేసిన జస్టిస్ విశ్వనాథన్, "మమ్మల్ని ఆదేశిస్తున్నావా?" అని ప్రశ్నించాడు. ఈ క్రమంలో ప్రబల్ ప్రతాప్ మరింత ఆవేశంతో ఊగిపోతూ, తన చేతిలోని పత్రాలను గాలిలోకి విసిరాడు. అదే సమయంలో, ఆ బెంచ్‌లో లేని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌పై కూడా దూషణలకు దిగాడు. దీంతో భద్రతా సిబ్బంది వెంటనే రంగప్రవేశం చేసి అతడిని కోర్టు హాలు నుంచి వెలుపలికి తరలించారు. ఒక సైబర్ క్రైమ్ సిండికేట్‌కు సంబంధించిన కేసులో, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 173(4) కింద తాను సమర్పించిన దరఖాస్తును ప్రైవేట్ కంప్లైంట్‌గా మార్చడాన్ని సవాల్ చేస్తూ ప్రబల్ ఈ పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు హాలులో చోటుచేసుకున్న ఈ అసాధారణ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ద

# పండించిన ప్రతి గింజను కొంటున్నాం

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. ఇప్పటివరకు 74 లక్షల మంది రైతులకు, 1.45 కోట్ల ఎకరాల భూములకు గానూ మొత్తం రూ. 8,759 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించామన్నారు. అలాగే మహిళా సంక్షేమానికి కట్టుబడి కేవలం రెండున్నర ఏళ్లలోనే మహిళలకు రూ. 67,000 కోట్ల రుణాలను అందించామని, పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తూ రైతును రాజుగా చూస్తున్నామని భట్టి స్పష్టం చేశారు. మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు ఒక్కటి కూడా దెబ్బతినలేదని, కానీ బీఆర్ఎస్ నాయకులు రూ. 27,000 కోట్లతో అయిపోయే ప్రాజెక్టును రూ. 1,47,000 కోట్లకు పెంచి, కట్టక కట్టక కట్టిన కాళేశ్వరాన్ని కూల్చేశారని మండిపడ్డారు. హరీష్ రావు అబద్ధాలన్నీ ప్రోగేసి మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ చేసిన అప్పులు, వడ్డీలు కడుతూనే తాము ఉద్యోగుల బిల్లులు క్లియర్ చేస్తూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నాయకుల భవిష్యత్తు అయిపోయిందని, వారు మళ్లీ మాయమాటలతో ఊళ్లలోకి వస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని, తరిమి తరిమి కొడతారని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

# అమరావతికి 'శాంసంగ్ సిటీ'..

(మొదటి పేజీ తరువాయి)

కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) తయారీలో పేరొందిన డెల్టా ఎక్స్, ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ కంపెనీల ఉన్నతాధికారులతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. ఏపీలో భారీ ఎత్తున తయారీ, పరిశోధన యూనిట్లను స్థాపించాలని ఆయన ఈ కంపెనీలను ఆహ్వానించారు.

సియోల్‌లో డెల్టా ఎక్స్ (ఐవశ్రీఖశ) ఫౌండర్, సీఈవో స్టీఫెన్ కిమ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 25 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టుల లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ ప్రణాళికలకు అనుగుణంగా రాష్ట్రంలో సోలార్ మాడ్యూళ్లు, బ్యాటరీ సెల్స్ తయారీకి అనువైన పర్యావరణాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. పోర్టులు, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్న ఏపీలో ఒక బీఈఎస్ఎస్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డెల్టా ఎక్స్‌ను కోరారు. దీనికి డెల్టా ఎక్స్ సీఈవో స్టీఫెన్ కిమ్ సానుకూలంగా స్పందించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో తయారీ యూనిట్ ఏర్పాటుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన మంత్రికి తెలిపారు.

అనంతరం, ప్రపంచ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ జో యున్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తూ పలు ప్రతిపాదనలు చేశారు. ఏఐ, డేటా సెంటర్ హబ్: రాష్ట్రంలోని 10 గిగావాట్ల డేటా సెంటర్ పైప్‌లైన్‌ను ఉపయోగించుకుని, ఏఐ-కంప్యూట్, సర్వర్ తయారీ, సర్వీసింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను శాంసంగ్‌కు ప్రధాన కేంద్రంగా మార్చాలని లోకేశ్ కోరారు. తయారీ యూనిట్లు: ఏపీలో ఒక డిస్‌ప్లే ఫ్యాబ్, విశాఖపట్నంలోని ఐఎస్ఎం ఓఎస్ఏటీ క్లస్టర్‌ను ఆధారంగా చేసుకుని కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ కోసం ఒక సెమీకండక్టర్ యూనిట్ (ఓఎస్ఏటీ) ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు మద్దతుగా మొబైల్, డివైస్ బ్యాటరీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

అమరావతిలో భాగస్వామ్యం: రాజధాని అమరావతి నిర్మాణం, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనలో శాంసంగ్ భాగస్వామి కావాలని ఆహ్వానించారు. అమరావతి క్వాంటం వ్యాలీలో శాంసంగ్ ఆర్&డీ విభాగాన్ని నెలకొల్పాలని సూచించారు. శాంసంగ్ సిటీ: వీటన్నిటికీ మించి శాంసంగ్ బహుళ విభాగాలకు ఒకేచోట నిలయంగా ఉండేలా ఏపీలో ఒక ప్రత్యేక 'శాంసంగ్ సిటీ'ని నిర్మించాలన్న భారీ ప్రతిపాదనను కూడా లోకేశ్ వారి ముందుంచారు. మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనలపై శాంసంగ్ ప్రతినిధులు స్పందిస్తూ, తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు. మొత్తం మీద, గ్రీన్ ఎనర్జీ, హై-టెక్ తయారీ రంగాలలో కొరియా దిగ్గజాలను ఏపీకి ఆకర్షించేందుకు మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రయత్నాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా డెల్టా ఎక్స్ నుంచి సానుకూల స్పందన రావడం రాష్ట్రానికి శుభపరిణామంగా భావిస్తున్నారు.

# పవన్‌ను లక్ష్యంగా చేసుకుని కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ ముగ్గురూ తాడేపల్లి నుంచి వస్తున్న ఒకే స్క్రిప్ట్‌ను అమలు చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేధావుల ముసుగులో వీరు చేస్తున్న ప్రయత్నాలు, వైఎస్ జగన్‌తో జడా శ్రావణ్ భేటీ కావడంతో బట్టబయలయ్యాయని అన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్, జడా శ్రావణ్‌ను లక్ష్యంగా చేసుకుని పలు సూటి ప్రశ్నలు సంధించారు. "జగన్‌పై పోరాటానికి రూ. 25 కోట్లు సొంత డబ్బులు ఖర్చు పెట్టానని చెప్పిన శ్రావణ్‌కు అంత సొమ్ము ఎలా వచ్చిందో చెప్పాలి. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన, తక్కువ కాలం జడ్జిగా పనిచేసి, తర్వాత సాధారణ న్యాయవాదిగా ఉన్నారు. అలాంటి వ్యక్తికి అంత డబ్బు ఎలా వస్తుంది? మాకు తెలిసిన సమాచారం ప్రకారం, అవినీతి కేసుల్లో ఉండటం వల్లే ఆయన జడ్జి ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అలాగే, సుగాలి ప్రీతి తల్లిని మోసం చేసిన మాట వాస్తవం కాదా?" అని దుర్గేశ్ నిలదీశారు. పవన్ కల్యాణ్ ఏనాడూ శ్రావణ్ ప్రస్తావన తేకపోయినా, కేవలం వైసీపీ ఆదేశాలతోనే శ్రావణ్ పదేపదే పవన్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. జోసెఫ్ రావణ్, శ్రావణ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య ఉన్న 'క్యాష్ బంధం' ఏంటో బయటపెట్టాలని దుర్గేశ్ డిమాండ్ చేశారు. "రావణ్‌ను అరెస్ట్ చేస్తే శ్రావణ్ ఎందుకు అంతగా ఇబ్బంది పడుతున్నారు? ప్రశ్నించే హక్కు అంటే బూతులు తిట్టడమేనా? వ్యక్తిత్వ హననం చేసేవారిని వెనకేసుకు రావడమేనా మీ పని?" అని ప్రశ్నించారు. ఈ ముగ్గురూ కలిసి ఏపీలో క్రైస్తవులను రెచ్చగొట్టి మతాల మధ్య ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీని వెనుక వైసీపీ ఎజెండా స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ప్రకాశ్ రాజ్ గురించి మాట్లాడుతూ, "కర్ణాటకలోని ధర్మస్థల పుణ్యక్షేత్రంపై, అక్కడి ఆచారాలపై ఆయన చేసిన విమర్శలు అందరికీ తెలుసు. ఆ కుట్ర కేసులో అరెస్ట్ అయిన చిన్నయ్య అనే వ్యక్తి, ప్రకాశ్ రాజ్ చీకటి కోణాన్ని బయటపెట్టాడు. ఆ కేసు నుంచి తప్పించుకోవడానికే ప్రకాశ్ రాజ్ ఏపీలో ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాడు" అని దుర్గేశ్ ఆరోపించారు.

# పెరిగిన నిత్యావసర ధరలతో పేదల జీవనం దుర్భరం

## నూనె, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను కట్టడి చేయాలి

## జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీసాల సుమలత



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 10)**
దేశంలో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేద ప్రజలు కొనుగోలు చేసి తినే పరిస్థితి కూడా లేకుండా పోయిందని కర్నూలు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీసాల సుమలత ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక పరిస్థితిని దిగజార్చిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానిదేనని ఆమె విమర్శించారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది బోయ క్రాంతి నాయుడు సూచన మేరకు కర్నూలు నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో పేద ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీసాల సుమలత మాట్లాడుతూ, దేశ ఆర్థిక పరిస్థితులు బాగున్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని అన్నారు.అమెరికా, చైనాలతో భారత్ పోటీ పడుతోందని చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, అదే సమయంలో ప్రజలు తమ అవసరాలను తగ్గించుకోవాలని చెప్పడం ద్వారా కేంద్ర ప్రభుత్వ వైఫల్యం బయటపడిందని విమర్శించారు. వంటనూనెలు, గ్యాస్, ఎరువులు, పెట్రోల్, డీజిల్ ధరలు నిరంతరం పెరుగుతూ సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నాయని పేర్కొన్నారు.దేశంలో పెరుగుతున్న ధరలకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలే ప్రధాన కారణమని ఆరోపించిన ఆమె, ధరల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ ఆర్థిక పరిస్థితిని దిగజార్చినందుకు ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మీసాల సుమలత డిమాండ్ చేశారు.

# వర్షాభావ పరిస్థితుల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలి

## -మండల వ్యవసాయ అధికారి ఉషారాణి



**దేవనకొండ, జూలై 10( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
దేవనకొండ మండలంలో జూన్ 14వ తేదీ నుండి ఇప్పటివరకు గణనీయమైన వర్షపాతం నమోదు కాకపోవడంతో పలుచోట్ల వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించి పంటలను రక్షించుకోవాలని సూచించారు.పొలాల్లో గుంటక పాసి సేద్యం చేయడం ద్వారా కలుపు మొక్కలను నివారించడంతో పాటు భూమిలో ఉన్న తేమ ఆవిరి కాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు.భూమిలో తేమ లేని పరిస్థితుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రసాయన ఎరువులు వేయకూడదని రైతులకు సూచించారు. మొక్కలకు అవసరమైన పోషకాలు అందించేందుకు 19:19:19 లేదా 13:0:45 (పొటాషియం నైట్రేట్) వంటి నీటిలో కరిగే ఎరువులను లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి ఆకులపై పిచికారీ చేస్తే సుమారు వారం రోజుల పాటు పంటలకు ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు.వర్షాభావ పరిస్థితుల్లో రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉన్నందున పసుపు లేదా నీలం జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రారంభ దశలో వేపనూనెను నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా పురుగులను సమర్థవంతంగా నియంత్రించవచ్చని వివరించారు.ఎండు తెగులు నివారణ కోసం ఎకరాకు 2 కిలోల ట్రైకోడెర్మా విరిడీ, 2 కిలోల సూడోమోనాస్‌ను 20 కిలోల ఇసుకలో కలిపి వరుసల మధ్య చల్లాలని సూచించారు. దీంతో నేల ద్వారా వ్యాపించే శిలీంధ్ర తెగుళ్లను నియంత్రించి పంట ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే వర్షాభావ ప్రభావాన్ని తగ్గించి పంటలను రక్షించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి రైతులకు విజ్ఞప్తి చేశారు.

# కప్పట్రాళ్ల అభివృద్ధికి సహకరిస్తాం: బొమ్మిడాల ట్రస్ట్






**దేవనకొండ జూలై 10(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**గుంటూరు నగరంలోని శ్రీ కన్వెన్షన్ హాల్లో బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన విద్యార్థినులు శైలజ, మైమున్, అశ్విని పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈగల్ ఐజి శ్రీ ఆకే రవికృష్ణ, ఐపీఎస్ మాట్లాడుతూ, కప్పట్రాళ్ల గ్రామ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. తన చొరవతో బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ ద్వారా గ్రామంలోని పలువురు విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తున్నామని తెలిపారు. అలాగే గ్రామంలోని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి దేశానికి సేవ చేసే అత్యున్నత స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.గ్రామంలో తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల కృషి వల్ల గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఆయన అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన 30 మంది విద్యార్థులు నవోదయ విద్యాలయాల్లో సీట్లు సాధించడం ఎంతో ఆనందకరమైన విషయమని పేర్కొన్నారు. త్వరలో కప్పట్రాళ్ల గ్రామాన్ని సందర్శించి గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షిస్తానని తెలిపారు. భవిష్యత్తులో కప్పట్రాళ్లను విద్యకు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ ప్రతినిధి రఘు మాట్లాడుతూ, తమ సంస్థ కూడా కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన పలువురు విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందిస్తోందని, గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ జ్యోతి సీఈవో బి. నారాయణ, ఈగల్ సీఐ విక్టర్, విద్యార్థుల తల్లిదండ్రులు, బొమ్మిడాల ట్రస్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మట్కా నిర్వహిస్తున్న ముగ్గురి అరెస్ట్



**అనంతపురం/గుత్తి, జూలై 10: (రిపబ్లిక్ న్యూస్)**
పట్టణంలోని పత్తికొండ రోడ్డులో రైల్వే బ్రిడ్జి కింద మట్కా నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.48,300 నగదును స్వాధీనం.గ్రామ సమాచారం మేరకు గుత్తి సీఐ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి వద్ద లభించిన నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

# పార్కుల స్థలాలపై కన్నేస్తే కఠిన చర్యలు

## ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం కమిషనర్ చల్లా ఓబులేసు

## వీకర్ సెక్షన్ కాలనీ సమీప పార్కు స్థల పరిశీలన.. హెచ్చరిక బోర్డు, ఫెన్సింగ్‌కు ఆదేశాలు








**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 10)**
నగరపాలక సంస్థకు చెందిన పార్కుల స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలోని ఎల్.పీ. నెం. 69/87లో ఉన్న పార్కు స్థలాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ స్థలాన్ని కొందరు అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే పార్కు స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలోని సుమారు 40 సెంట్ల పార్కు స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా రాళ్లు పాతినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గతంలో వాటిని తొలగించినప్పటికీ ఇటీవల మళ్లీ కొందరు రాళ్లు పాతడం ఆందోళన కలిగించిందన్నారు.ప్రజల కోసం కేటాయించిన పార్కుల స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కబ్జా చేయనివ్వబోమని, ఆక్రమణలకు పాల్పడే వారెవరైనా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానికులు కూడా అప్రమత్తంగా ఉండి పార్కు స్థలాల ఆక్రమణ యత్నాలను అడ్డుకోవాలని, అలాంటి ఘటనలు గమనించిన వెంటనే నగరపాలక సంస్థ అధికారులకు సమాచారం అందించాలని కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు.

# యువ జనాభానే దేశ ప్రగతికి మూలస్తంభం

## సంతానోత్పత్తి రేటు కాపాడుకోవాలి - దేశాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకం: డా. కె. చిట్టి నరసమ్మ







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 10)**
సందర్భంగా కర్నూలు మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో న్యూ లెక్చరర్ గ్యాలరీలో తృతీయ సంవత్సరం పార్ట్1 ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం "దేశాభివృద్ధిలో యువ జనాభా సంతానోత్పత్తి రేటు పాత్ర" అనే అంశంపై డిబేట్ పోటీలు నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీఎంఈ, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. చిట్టి నరసమ్మ మాట్లాడుతూ, భారతదేశం యువ జనాభా అధికంగా ఉన్న దేశమని, యువత తమ శక్తి, ప్రతిభ, విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటే దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన, విద్యావంతమైన యువతే దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని ఆమె అన్నారు.
దేశాభివృద్ధిలో యువ జనాభా కీలక పాత్ర పోషిస్తోందని, సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గిపోతే భవిష్యత్తులో శ్రామిక శక్తి కొరత ఏర్పడి అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని డా. చిట్టి నరసమ్మ హెచ్చరించారు. అందువల్ల సమతుల్య జనాభా వృద్ధిని కొనసాగించడం అవసరమని సూచించారు.
డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థులు యువ జనాభా దేశ ఆర్థిక, సామాజిక, వైద్య, సాంకేతిక రంగాల పురోగతికి ప్రధాన శక్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. నిర్దిష్ట వయస్సులో వివాహం, సంతానోత్పత్తి రేటు పరిరక్షణ, యువత నైపుణ్యాల అభివృద్ధి వంటి సమకాలీన అంశాలపై విశ్లేషణాత్మకంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.
వైస్ ప్రిన్సిపాల్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. సింధియా శుభప్రద మాట్లాడుతూ, యువతలో సామాజిక బాధ్యత, ఆరోగ్య అవగాహన, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు.
ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డా. పుష్పలత, సీనియర్ రెసిడెంట్ డా. బ్రయాన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రపంచ జనాభా దినోత్సవ సందేశాన్ని ప్రతిబింబించే ఆకర్షణీయమైన పోస్టర్లను ప్రదర్శించారు.
అనంతరం ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించి, ఆరోగ్యకరమైన కుటుంబాలు, సమతుల్య జనాభా, యువత సాధికారత, స్థిరమైన అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు.
కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్లు డా. అరుణ, డా. రేణుక, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. రవి నాయక్, డా. వెంకటేశ్వర్లు, డా. నాగరాజు, డా. వైష్ణవి, డా. ప్రసన్నరాణి, లెక్చరర్లు సురేష్, భవాని ప్రసాద్, సరిత, రాజశేఖర్‌తో పాటు పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదు

## - ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంత్రాలయం సిఐ కు వినతిపత్రం అందజేత

**మంత్రాలయం, జూలై, 10,**
**(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
జర్నలిస్టుల వృత్తి ధర్మానికి ఆటంకం కలిగిస్తూ, వారి ప్రాణాలకు తెగబడేలా బెదిరింపులకు పాల్పడే సంఘ వ్యతిరేక శక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నేతలు తీవ్రంగా డిమాండ్ చేశారు. కౌతాళంలో వైకాపా నేతల అక్రమ ఆక్రమణలపై వార్తలు రాసినందుకు గానూ.. మంత్రాలయం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్ వి. ప్రకాష్ రెడ్డిని ఫోన్ ద్వారా దూషించి, ప్రాణభీతి కలిగేలా బెదిరించిన వైఎస్ఆర్సీపీ కార్యకర్త బలరాంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మంత్రాలయం స్థానిక పోలీసు సస్టేషన్ లో ఎస్ఐ మల్లికార్జునకు ఏపీయూడబ్ల్యూజే యూనియన్ తాలూకు అధ్యక్షు లు జయరాజ్ , ఆధ్వర్యంలో



వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ఏపియూడ్యూజే తాలుకా అధ్యక్షులు మాట్లాడుతూ.. గత ఆరేళ్లుగా మంత్రాలయం నియోజకవర్గంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌గా ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్న వి. ప్రకాష్ రెడ్డి, టీవీ 5 రామస్వామి ఇటీవల కౌతాళంలో వైకాపా కార్యకర్తలు ప్రభుత్వ భూములు, వాగులను ఆక్రమించి ఇళ్లు నిర్మించిన ఉదంతంపై బాధితుల గోడును వివరిస్తూ సమగ్ర కథనాన్ని సేకరించారన్నారు. ఈ నిజాలను ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మరియు టీవీ5 ఛానెళ్లలో ప్రసారం చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈ వార్తా ప్రసారంపై కక్ష పెంచుకున్న అక్రమ నిర్మాణదారుడు, వైకాపా కార్యకర్త అయిన బలరాం (తండ్రి: పరశురామ్) అనే వ్యక్తి.. గురువారం సాయంత్రం ప్రకాష్ రెడ్డికి ఫోన్ చేసి అత్యంత నీచమైన పదజాలంతో దూషించడమే కాకుండా, "నీ అంతం చూస్తా" అంటూ తీవ్రంగా బెదిరించడం దుర్మార్గుల చర్య అని వారు మండిపడ్డారు. బెదిరింపులకు పాల్పడిన సదరు వ్యక్తిపై ఇప్పటికే పలు పోలీస్ స్టేషన్లలో పాత కేసులు ఉన్నాయని, ఇటువంటి నేర చరిత్ర కలిగిన వ్యక్తి బహిరంగంగా జర్నలిస్టును బెదిరించడం పట్ల జర్నలిస్టు లోకం తీవ్ర దిగ్భ్రాంతికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు.నిరంతరం ప్రజాస్వామ్య రక్షణ కోసం, ప్రజల పక్షాన నిలిచే విలేకరులకు రక్షణ కరువైతే సహించేది లేదన్నారు ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే తాలూకు ప్రధాన కార్యదర్శి హుస్సేని జీ రావు , కార్యనిర్వాహక కార్యదర్శి సూర్య నారాయణ , మండల గౌరవ అధ్యక్షులు రానోజీ రావు మాజీ మండలాధ్యక్షులు భీమరాయ్ , తదితరులు ఉన్నారు.

# అనారోగ్యంతో ఆటో డ్రైవర్ మృతి.. కుటుంబానికి ఆటో డ్రైవర్ల ఆర్థిక సాయం

**అనంతపురం/ గుత్తి, జూలై 10: (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి ఆర్ఎస్ ఎస్సీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ప్రతాప్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆయనను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం ఆయన మృతి చెందారు. ప్రతాప్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ప్రతాప్ మృతి విషయం తెలుసుకున్న గుత్తి పట్టణం, గుత్తి ఆర్ఎస్ ప్రాంతాలకు చెందిన ఆటో డ్రైవర్లు ఆయన



నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తమ వంతు సహాయంగా స్వచ్ఛందంగా చందాలు సేకరించి రూ.6,500 నగదును మృతుడి కుటుంబానికి అందజేశారు. కష్టకాలంలో తోటి ఆటో డ్రైవర్లు అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మృతుడి కుమారుడు స్పందిస్తూ, ఆపద సమయంలో తమ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచిన ఆటో డ్రైవర్లందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఆటో నజీర్‌తో పాటు పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# జిల్లాలో సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు విస్తృత అవకాశాలు

**'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంగా మరిన్ని మైక్రో ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రోత్సహించాలి**

**విశ్వనగర్‌లో పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఎస్ఎస్ డైరీ యూనిట్‌ను సందర్శించి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**







**నంద్యాల బ్యూరో, జూలై 10( రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో ఆహార శుద్ధి పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని గ్రామీణ యువత, మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని విశ్వనగర్ లో ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద ఏర్పాటు చేసిన ఎస్ఎస్ డైరీ మిల్క్ అండ్ కర్డ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. యూనిట్‌లో తయారు చేస్తున్న పాలు, పెరుగు, మజ్జిగ, నెయ్యి, ఫ్లేవర్డ్ మిల్క్ తదితర ఉత్పత్తుల తయారీ ప్రక్రియను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చిన్న తరహా ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రభుత్వం సబ్సిడీతో పాటు బ్యాంకుల ద్వారా క్రెడిట్ లింక్డ్ రుణ సదుపాయం కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని స్థానిక వనరుల ఆధారంగా మరిన్ని పరిశ్రమలను స్థాపించాలని సూచించారు. విశ్వనగర్‌లో ఏర్పాటు చేసిన ఈ మిల్క్ అండ్ కర్డ్ ప్రాసెసింగ్ యూనిట్ సుమారు రూ.18.14 లక్షల వ్యయంతో స్థాపించబడిందన్నారు. ఇందులో ప్రభుత్వం నుంచి రూ.6.35 లక్షల సబ్సిడీ, బ్యాంకు ద్వారా రుణం, యజమాని స్వంత పెట్టుబడితో యూనిట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా యంత్రాంగం, బ్యాంకర్ల సమన్వయంతో పనిచేయడం వల్ల ఈ యూనిట్ విజయవంతంగా స్థాపించబడిందని తెలిపారు. ఇలాంటి సూక్ష్మ పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలుగా అభివృద్ధి చెందడంతో పాటు స్థానికంగా ఐదు నుంచి పది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. సమర్థవంతంగా నిర్వహిస్తే నెలకు రూ.2 నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం ఆర్జించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇటువంటి పరిశ్రమలు కుటుంబాల ఆర్థికాభివృద్ధికి, గ్రామీణ ఉపాధి విస్తరణకు దోహదపడతాయని తెలిపారు. జిల్లాకు పీఎంఎఫ్ఎంఈ పథకం కింద మొత్తం 56 యూనిట్ల లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు 26 యూనిట్లకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. మిగిలిన యూనిట్లను కూడా రాబోయే రెండు మూడు నెలల్లో పూర్తి చేసేలా అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి స్థానిక వనరులకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించి మరిన్ని మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. బ్యాంకర్లు అర్హులైన లబ్ధిదారులకు రుణాలను సత్వరమే మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాలని కోరారు.

వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్' లక్ష్యంతో ప్రతి కుటుంబంలో కనీసం ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. దీని ద్వారా జిల్లా స్థూల ఆర్థికాభివృద్ధి, తలసరి ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో జిల్లాలో మిల్లెట్స్ ప్రాసెసింగ్, తేనె సేకరణ మరియు ప్రాసెసింగ్, ఫ్లోరికల్చర్ ఆధారిత విలువ ఆధారిత ఉత్పత్తులు, డ్రై ఫ్రూట్స్, వెట్ ఫ్రూట్స్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో కూడా పెద్ద ఎత్తున సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. నాబార్డ్ ఏజీఎం కార్తికేయ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, జిల్లా పశుసంవర్ధక అధికారి గోవింద నాయక్, ఎల్డిఎం అయ్యప్ప రెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# బ్రాహ్మణపల్లి గ్రామంలో పశు వైద్యశాల కు భూమి పూజ

**రిలయన్స్ ఫౌండేషన్ 40 లక్షల సహకారంతో పశువైద్యశాల**

**ఓర్వకల్లుటిడిపి మండల కన్వీనర్ నాగిరెడ్డి**



**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 10 (రిపబ్లిక్ న్యూస్)** కర్నూలు జిల్లాఓర్వకల్లు మండలం టిడిపి మండల కన్వీనర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో,బ్రాహ్మణపల్లి గ్రామంలో 40 లక్షలు రిలయన్స్ ఫౌండేషన్ వారి సహకారంతో గ్రామీణ పశు వైద్యశాల కు భూమి పూజ నిర్వహించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతుంది కూటమి ప్రభుత్వమే ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ, 2014 తర్వాత ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చేశారని తెలిపారు. ఎయిర్‌పోర్ట్, జయరాజ్ ఇస్పాత్, డీఆర్‌డీఓ, ఆసియాలోనే అతిపెద్ద సోలార్ పార్క్ వంటి ప్రాజెక్టులతో ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రిలయన్స్, సిగాచి, అగస్త్య వంటి పరిశ్రమలు రావడంతో పాటు డ్రోన్ హబ్, ఎంఎస్ఎంఈ పార్కుల ద్వారా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, పరిశ్రమల మంత్రి టీజీ భరత్ కృషితో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని ఎమ్మెల్యే చరిత రెడ్డి అన్నారు. ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి మండల కన్వీనర్ నాగిరెడ్డి కృషి వల్ల పశు వైద్యశాల రావడం జరిగింది, దీనికి నాగిరెడ్డి రిలయన్స్ ఫౌండేషన్ వాళ్లతో మాట్లాడి ఎమ్మార్వో విద్యాసాగర్ తో స్థలం కావాలని చెప్పడంతో ఎమ్మార్వో కూడా అతి త్వరగా స్థలం చూపించడం జరిగింది, ఇలాంటి అభివృద్ధి పనులు ఇంకెన్నో బ్రాహ్మణపల్లి గ్రామానికి అభివృద్ధి పనులు చేస్తారని తెలిపారు, ఇక్కడ ఉన్న కంపెనీలో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే చెప్పడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండల టిడిపి కన్వీనర్ నాగిరెడ్డి ఎమ్మార్వో విద్యాసాగర్ ఎంపీడీవో నాగ అనసూయ పశువు వైద్యశాల డాక్టర్లు సిబ్బంది, హుస్సేన్ భాష, బోయ కర్ణాకర్, నాగరాజు, సతీష్, మరియుటిడిపి మండల నాయకులు టిడిపి గ్రామాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# కాల్వబుగ్గ ఇటుకల బట్టి ఓనర్ అచ్చుమౌలాలి పై కేసు నమోదు చేయాలి

**- భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ డిమాండ్**




**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 10 (రిపబ్లిక్ న్యూస్)** శుక్రవారం రోజు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా సిఆర్ భవన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఓర్వకల్ మండల కార్యదర్శి రమేష్ సిపిఐ నగర సహాయ కార్యదర్శి మహేష్ లు మాట్లాడుతూ ఓర్వకల్ మండలం కాల్వబుగ్గ గ్రామంలో ఇటుక బట్టీలో వర్క్ చేసే డ్రైవర్ నిన్న నైటు ఇటికల బట్టియజమాని అచ్చు మౌలాలి నిర్లక్ష్యం వల్ల విద్యుత్ షాక్కు గురై వడ్డే వెంకటేశ్వర్లు ఖస్త్రవ 50 మరణించడం జరిగింది. అతనికి భార్యముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇంట్లో యజమాని పని చేస్తేనే పూట గడుస్తది ఆకుటుంబం ఇప్పుడు రోడ్డున పడ్డది ఇప్పుడు ఆ కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలి అదేవిధంగా ఇటుక బట్టి ఓనర్ అచ్చు మౌలాలి పై కేసు నమోదు చేయాలి. అదే విధంగా ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా డిమాండ్ చేస్తున్నాం అదేవిధంగా తెలంగాణ నుంచి చాలా కుటుంబాలు వలసలు వచ్చి ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నారు. అందులో మైనర్ బాలికలు కూడా ఉన్నారు తక్షణమే ప్రతి ఒక్కబట్టిని ప్రభుత్వ అధికారులు విజిట్ చేసి ఎవరైతే మైనర్ బాలికలతో పనిచేపిస్తున్నారో ఇటుక బట్టీల ఓనర్లపై తక్షణమే కేసులు నమోదు చేయాలని ఈరోజు డిమాండ్ చేస్తున్నాము అదేవిధంగా ప్రమాదంలో మరణించిన వడ్డే వెంకటేశ్వర్లు కుటుంబాన్ని అన్ని విధాల ఇటుక బట్టి ఓనర్ అచ్చు మౌలాలి 20 లక్షలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు కుమార్ ఈ ఐ వై ఎఫ్ నగర్ నాయకులు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

# పీఎం-అజయ్ పనులు వేగవంతం చేయాలి

**గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలకే తొలి ప్రాధాన్యం: కలెక్టర్ డా. ఏ. సిరి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 10)** ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ్ యోజన కింద ఎంపికైన గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రాజెక్ట్ అప్రైజల్ కమ్ కన్వర్జెన్స్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యతగా అమలు చేయాలని సూచించారు.

పీఎం-అజయ్ ఫేజ్-2 కింద హోళగుంద మండలంలోని మార్లమడికి, కర్నూలు మండలంలోని నూతనపల్లె, పెద్దకడుబూరు మండలంలోని మేకడోన, ఆస్పరి మండలంలోని నగరూరు, ఓర్వకల్ మండలంలోని ఉప్పలపాడు, మంత్రాలయం మండలంలోని బుదూరు, గుడిపాడు, గూడూరు మండలంలోని కురువనాగలాపురం, నందవరం మండలంలోని మాచపురం గ్రామాలు ఎంపికయ్యాయని తెలిపారు.

గ్రామాల్లో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యంగా తాగునీటి సమస్యల పరిష్కారానికే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తాగునీటి సరఫరా వ్యవస్థలు, పైప్‌లైన్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు అందుబాటులో ఉన్న నిధులను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

తాగునీటి పనుల అనంతరం నిధుల లభ్యతను బట్టి డ్రైనేజీ పనులను చేపట్టాలని పేర్కొన్నారు. మంజూరైన నిధులను వేగంగా ఖర్చు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, 100 శాతం నిధుల వినియోగానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులు ముందుకు సాగాలని, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖ అధికారులు పెండింగ్‌లో ఉన్న పనులు, వ్యయాలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఇన్‌చార్జి జిల్లా పరిషత్ సీఈఓ సుబ్బారెడ్డి, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి రాధిక, డీఎంహెచ్ఓ డా. భాస్కర్ రాజు, ఐసీడీఎస్ పీడీ విజయ, డీపీఓ భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రజకుల ఐక్యతను చాటి చెప్పుదాం

**రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి పిలుపు**

**రజక ఆకాంక్ష సభను విజయవంతం చేయాలి**



**అనంతపురం/ గుత్తి సంక్షేమం, జూలై 10: (రిపబ్లిక్ న్యూస్)** గుత్తి పట్టణంలో ఈనెల 12న నిర్వహించనున్న ఉమ్మడి అనంతపురం జిల్లాల రజక ఆకాంక్ష సభను విజయవంతం చేయాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి రజకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం గుత్తిలో ఉన్న రోడ్లు భవనాల కార్యాలయంలో రజక సంఘం నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

**వృత్తిపరమైన ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్దాం**

ఈ సందర్భంగా రాష్ట్ర రజక చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రజకుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆమె తెలిపారు. అయినప్పటికీ రజకులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి ఆకాంక్షలు, వృత్తిపరమైన ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ ఆకాంక్ష సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నందున రజకుల సమస్యలను నేరుగా వారి దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**సంక్షేమ కార్యక్రమాలు సభా వేదికగా తీర్మానాలు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల నుంచి రజకులు భారీ సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలన్నారు. ఉమ్మడిజిల్లాల వ్యాప్తంగా ఉన్న రజకుల ఐక్యతను చాటిచెప్పే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రజకుల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టే విధంగా ఈ సభా వేదికగా తీర్మానాలు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, పలువురు రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# జూలై 14తో ఎస్ఐఆర్ ప్రక్రియకు ముగింపు..

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

**రాజకీయ పార్టీలు, ప్రజలు పూర్తి సహకారం అందించాలి : జిల్లా ఎన్నికల అధికారి డా. ఎ. సిరి**

**వారాంతపు సెలవుల్లోనూ పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని వెల్లడి**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 10)** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువు ఈ నెల 14వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజలు పూర్తి సహకారం అందించి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా అమలు చేస్తున్నామని, మిగిలిన నాలుగు రోజుల్లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ కార్యక్రమాలను మరింత సమర్ధవంతంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి అర్హ ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్లను (బీఎల్ఏలు) నియమించి, బూత్ స్థాయిలో బీఎల్వోలతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియకు సహకరించాలని కోరారు.రెండో శనివారం, ఆదివారం రోజుల్లో కూడా జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకుని, పూర్తి వివరాలు, ఫోటోలతో నింపి తిరిగి సమర్పించాలని సూచించారు.ఓటరు జాబితాలో కొత్త నమోదులు, సవరణలు, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు, వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాల సవరణ, డబుల్ ఎంట్రీల తొలగింపు వంటి అంశాలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు చురుకుగా పాల్గొనాలని కోరారు.జిల్లాలో 250 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, 48 పోలింగ్ కేంద్రాల స్థానాలను మార్చినట్లు అధికారులు వెల్లడించారు. బీఎల్వోల పనితీరుకు సహకరించేందుకు డ్వామా, అంగన్‌వాడీ తదితర శాఖల సిబ్బందిని కూడా నియమించినట్లు తెలిపారు.సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888
శనివారం 11 జులై 2026

# ఎల్లమ్మకు న్యాయం చేయాలి..



**అనంతపురం/గుత్తి, జూలై 10: (రిపబ్లిక్ న్యూస్)**
ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎల్లమ్మకు న్యాయం చేయాలని, ఆమె నుంచి డబ్బులు తీసుకున్న వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేయాలని ఏపీఎంఆర్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం గుత్తి ఆర్అండ్బీ అతిథి గృహంలో ఏపీఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్దిరోజుల క్రితం గుత్తికర్నూలు రోడ్డులోని కోళ్లఫారం ప్రాంతంలో నివాసం ఉంటున్న ఎల్లమ్మకు గుత్తిలో ఇంటి స్థలాలు, పట్టాలు ఇప్పిస్తామని నమ్మించి అనంతపురానికి చెందిన శివగంగాధర్ అనే వ్యక్తి ఆమె ద్వారా పలువురి నుంచి సుమారు రూ.5 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం డబ్బులు ఇచ్చిన వారు శివగంగాధర్ వివరాలు తెలియక ఎల్లమ్మనే బాధ్యురాలిగా భావించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి శివగంగాధర్‌పై కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఎల్లమ్మతో పాటు బాధితులను తీసుకుని పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అదే విధంగా బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 14 నుంచి గుత్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట, సర్వే నంబర్ 565 భూముల అంశంపై ఏపీఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో అడవి రాముడు, శివశంకర్, అంజి, హేమంత్, ఎల్లమ్మ, కాశీం, ఈరన్నతో పాటు ఏపీఎంఆర్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కర్నూలులో వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి - ఆరుగురు అరెస్ట్

## ముగ్గురు మహిళలు, ముగ్గురు విటులు అదుపులోకి - పిటా చట్టం కింద కేసు నమోదు



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 10)**
కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముజఫర్‌నగర్, ఆదిత్యనగర్ ప్రాంతాల్లో ఓ ఇంటిలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంపై పోలీసులు దాడులు నిర్వహించి మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేశారు.
స్థానిక పెద్దల సమక్షంలో నిర్వహించిన తనిఖీలలో ఆ ఇంటిలో పలువురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వారిని విచారించారు. ప్రాథమిక విచారణలో ఆ ఇంటిని అద్దెకు తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. ఈ కార్యకలాపాలకు మరికొందరు సహకరిస్తూ, పరిచయస్తుల ద్వారా వ్యక్తులను అక్కడికి రప్పిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా ముగ్గురు మహిళలతో పాటు కర్నూలు బి. తాండ్రపాడుకు చెందిన మహేశ్వర్, టీ. గోగులపాడుకు చెందిన ఖలీల్, ఒంగోలుకు చెందిన వెంకటేశ్వర్లు అనే ముగ్గురు విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురిపై అనైతిక ట్రాఫిక్ నివారణ చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్ నిమిత్తం గౌరవ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ సింహా తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద లేదా అసాంఘిక కార్యకలాపాలను గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# గుంతకల్ పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరా కు అంతరాయం - ఏడి నాగేంద్ర కుమార్.



**గుంతకల్ జూలై 10 ( రిపబ్లిక్ న్యూస్)**
గుంతకల్ పట్టణం నందు రెండో శనివారం కావున ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది కొన్ని ప్రాంతాలు మాత్రమే. సత్యనారాయణ పేట అంజలి నగర్ మారుతి నగర్, విజయనగర్ కాలనీ, పకీరప్ప కాలనీ, సంతోష్ నగర్, రాజేంద్రనగర్, పాత గుత్తి రోడ్ ఎస్ఎల్వీ థియేటర్, కాయగూరలు మార్కెట్, రేపు విద్యుత్ మరమ్మతులు కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుంది ఏడి నాగేంద్ర కుమార్ తెలియజేశారు. ప్రజలు అందరూ సహకరించాలని కోరారు కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సీఎం ఆర్ ఎఫ్ రిలీఫ్ చెక్కుల పంపిణీ చేసిన గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం.



**గుంతకల్ జూలై 10 ( రిపబ్లిక్ న్యూస్)**
గుంతకల్లు పట్టణం నందు ఈరోజు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం క్యాంప్ కార్యాలయం నందు సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన
గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు ఆయన సోదరుడు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి హాజరు కావడం జరిగినది ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్లో ట్రీట్మెంట్ తీసుకున్న వారికి పేదవారి కుటుంబానికి పెద్ద కొడుకుల ఆంధ్రప్రదేశ్ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు అలాగే ఈ రోజున గుంతకల్లు నియోజకవర్గం దాదాపు 48 మందికి గాను 18,66,539 రూపాయలు అందించడం జరిగినది అలాగే మన గుంతకల్లు నియోజకవర్గం లో మొత్తం దాదాపుగా 970 మంది గాను 7 కోట్లు రూపాయలు నిరుపేద కుటుంబాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆర్థిక సహాయం చేయడం జరిగినది సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కుల లబ్ధిదారులు మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గం లో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో మన కూటమి ప్రభుత్వం తరపున ఎవరు పోటీ చేసిన గెలిపించుకొని తీరుతామని తెలియజేశా రు అలాగే మన గుంతకల్లు నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి బహుమతిగా ఇస్తామని ఈ సభముఖంగా తెలియజేస్తున్నాము కూటమి ప్రభుత్వానికి మరియు గుమ్మనూరు కుటుంబానికి రుణపడి ఉంటామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గం కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చేనేత,హస్త కళాకారులను ప్రోత్సహిద్దాం

## మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి



**అనంతపురం కల్చరల్, జూలై 10,(రిపబ్లిక్ న్యూస్):**
సమాజంలోని ప్రతి ఒక్కరూ చేనేత, హస్త కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి తెలిపారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం 3వ రోడ్డు జి. ఆర్. గార్డెన్, గేట్ నెం 4లో ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (లేపాక్షి) విజయవాడ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళా మహోత్సవం- 2026 ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి పాల్గొని ప్రారంభించారు.

**చేనేతలకు 200 యూనిట్లు పవర్లూమ్ కుటుంబాలకు 500 యూనిట్లు**

ఈ సందర్భంగా చైర్ పర్సన్ బల్లా పల్లవి మాట్లాడుతూ మన రాష్ట్ర విశిష్ట సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే ఎన్నో అద్భుతమైన చేతి వృత్తుల కళాఖండాలు హస్తకళల ప్రదర్శన మరో వైపు విక్రయాలు ఈ మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తాయన్నారు. రాష్ట్రానికి చెందిన హస్త కళాకారులు రూపొందించే కళారూపాలను ప్రదర్శించి అమ్మకాలు నిర్వహించుకునేలా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, చేనేత మంత్రి సవితమ్మ ప్రత్యేక చర్యలు తీసుకొని కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చేనేతలకు 200 యూనిట్లు పవర్లూమ్ కుటుంబాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే మన ఉమ్మడి జిల్లాలోని ధర్మవరం ప్రాంతం ప్రపంచవ్యాప్తంగా చేనేత వస్త్రాలకు ప్రసిద్ధిగాంచిందని, తోలుబొమ్మలాట నిమ్మలకుంట తోలుబొమ్మలాట కళాకారులు కూడా ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చారని అన్నారు.

**మంగళగిరి పట్టుచీరలు చేనేత కుటుంబాలకు గుర్తింపు**

సాంప్రదాయ శిల్పాలు ,కొండపల్లిబొమ్మలు, తోలుబొమ్మలు ,లేపాక్షి హస్తకళలతో కూడిన మరెన్నో వైవిధ్య ఫలితమైన వస్తువులను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేయడమైందని కళాభిమానులు సాధారణ ప్రజలు అందరూ ఈ స్వర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని హస్త కళాకారులను ప్రోత్సహించవలసిందిగా కోరారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం కళా నైపుణ్యంతో రూపొందించిన హస్త కళాకారుల ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నదని తెలిపారు.
గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం చేనేత, హస్త కళాకారులను ప్రోత్సహించే విధంగా చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మంగళగిరి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మంగళగిరి పట్టుచీరలు చేనేత కుటుంబాలకు గుర్తింపు తెస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అనంతపురంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ లోవివిధ ప్రాంతాల నుండి హస్త కళాకారులు





రూపొందించిన 17 వివిధ వస్తు సామాగ్రి స్టాళ్లను చైర్ పర్సన్ బల్లా పల్లవి సందర్శించి హస్త కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి డిప్యూటీ మేనేజర్ తిమ్మయ్య, సురేష్, అమర్నాథ్ , నాగార్జున, సుహాసిని , పూర్ణిమ, హస్త కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వాలా గ్రో ఎరువు నాణ్యతపై ల్యాబ్ నివేదిక ప్రమాణాలకు అనుగుణంగా ఉందని నిర్ధారణ

## కందూరు రమేష్ కార్నర్ కు క్లీన్ చిట్



**పుంగనూరు ప్రతినిధి జూలై 10 రిపబ్లిక్ న్యూస్**
మండలంలోని పలువురు రైతులు వాలా గ్రో కంపెనీ తయారు చేసిన 0-37-37-0.02 డ్రిప్ ఎరువు నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. రైతులు ఈ ఎరువు నకిలీదనిఆరోపిస్తూ సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న వ్యవసాయశాఖ అధికారులు వెంటనే స్పందించి, ఎరువు నాణ్యతను శాస్త్రీయంగా నిర్ధారించేందుకు నమూనాలను సేకరించారు. సోమల వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో కందూరులోని రమేష్ కార్నర్ షాప్ మరియు సోమలలోని వినాయక ట్రేడర్స్ దుకాణాల నుంచి సంబంధిత బ్యాచ్‌కు చెందిన ఎరువు శాంపిళ్లను సేకరించి పరీక్షల కోసం అమరావతి ల్యాబ్‌కు పంపించారు. శాంపిల్ సేకరణకు సంబంధించిన వివరాలు, పత్రాలు కూడా అదే రోజు రైతులకు మరియు సంబంధిత వర్గాలకు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. తాజాగా అమరావతి ల్యాబ్ నుంచి అందిన పరీక్ష నివేదికలో వాలా గ్రో 0-37-37-0.02 ఎరువు అన్ని ప్రమాణాలకు అనుగుణంగా ఉందని స్పష్టమైంది. ఎరువులో ఉండాల్సిన నత్రజని, భాస్వరం, పొటాష్ తో పాటు బోరాన్ పరిమాణాలు కూడా నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉన్నట్లు ల్యాబ్ నివేదిక వెల్లడించింది. పరీక్షించిన బ్యాచ్‌ను 'స్టాండర్డ్ బ్యాచ్' గా గుర్తించి, ఎరువు నాణ్యతలో ఎలాంటి లోపాలు లేవని ధృవీకరించింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ, రైతులు వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేయడమే లక్ష్యంగా పారదర్శకంగా శాంపిళ్లను సేకరించి ప్రభుత్వ గుర్తింపు పొందిన ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ల్యాబ్ నివేదిక ప్రకారం ఎరువు నకిలీ కాదని, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉందని తేలిందన్నారు. రైతులు కూడా ఎరువుల విషయంలో ఏవైనా అనుమానాలు ఉన్నప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలని, శాస్త్రీయ పరీక్షల ద్వారా నిజానిజాలు నిర్ధారించుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది. ల్యాబ్ నివేదిక వెలువడడంతో రైతుల్లో నెలకొన్న సందేహాలు తొలగిపోతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మండలంలోని రైతులందరికీ తెలియజేసి, వాస్తవ పరిస్థితిని ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని పలువురు రైతు ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. కాగా కందూరులోని రమేష్ కార్నర్ ఎరువుల దుకాణంలో ఇందుకు సంబంధించి రగడ జరిగింది అయితే నిజాయితీగా ఉండడం వల్లే నివేదిక నిజాయితీగా వచ్చింది అతనికి ఊరట లభించినట్లు అయింది.

# పీఎంఎఫ్‌బీవై పై రైతులకు అవగాహన కల్పించాలి: ఏడీఏ



**అనంతపురం/గుత్తి, జూలై 10:( రిపబ్లిక్ న్యూస్)** ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని గుత్తి వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ) వెంకటరాముడు సూచించారు. శుక్రవారం గుత్తి ఏడీఏ కార్యాలయంలో వ్యవసాయ డివిజన్ పరిధిలోని వ్యవసాయ అధికారులు (ఏవోలు), వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు)తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పంటలను పరిశీలిస్తూ రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని తెలిపారు. పంటల్లో ఎలాంటి మార్పులు, తెగుళ్లు లేదా ఇతర సమస్యలు కనిపించినా వెంటనే రైతులను అప్రమత్తం చేసి తగిన నివారణ చర్యలు సూచించాలని ఆదేశించారు. రైతులకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని సూచించారు.

# అమ్మవారికి రాహుకాల అభిషేకం



**చౌడేపల్లి ప్రతినిధి జూలై 10 రిపబ్లిక్ న్యూస్**
శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మకు రాహుకాల అభిషేకాన్ని సాంప్రదాయపద్ధంగా నిర్వహించారు ఉదయాన్నే వేద పండితులు అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకము అలంకరణ రావించారు అనంతరం రాహుకాల సమయంలో భార్యాభర్తల సమక్షం నందు అమ్మవారికి అభిషేకం జరిగింది మధ్యాహ్నం వరకు భక్తులు వేచి ఉండి మరి దర్శనం చేసుకున్నారు పాత కళ్యాణ కట్ట వద్ద అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు దేవస్థానం వారు ఉచిత అన్న ప్రసాద కేంద్రాన్ని ఏర్పాటు చేశారు ఈ కేంద్రానికి పలమనేరు చెందిన నవీన్ అతని మిత్ర బృందం కూరగాయలను విరాళంగా అందించారు. ఆలయ అధికార అర్చక సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.

# వేణుగోపాల స్వామికి పాదపద్మ పీఠం గరుడ వాహనం బహుకరణ




**చౌడేపల్లి ప్రతినిధి జూలై 10 రిపబ్లిక్ న్యూస్**
స్థానిక రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి దాత నూతనంగా చేయించిన పంచలోహ పాద పద్మ పీఠం గరుడ వాహనం అందించారు. శుక్రవారం చౌడేపల్లి పట్టణానికి చెందిన ప్రభాకర్ సామాగ్రిని ఆలయ ప్రధాన అర్చకుడు గ్రామ పెద్దలు పిల్లాడి ఏజెన్సీస్ అధినేత పిల్లాడి జీవన్ ప్రకాష్ ,బంకు రాజన్న,రంగబాబు, ఆధ్వర్యంలో అందించారు. అనంతరం వాటిని స్వామి వారికి అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.



# సొంత నిధులతో స్మశాన వాటికను శుభ్రం

- రామిరెడ్డి ధ్వజారెడ్డి.





**రైల్వే కోడూరు జూలై 10 రిపబ్లిక్ న్యూస్.** రైల్వే కోడూరు మండలం తిమ్మిశెట్టిపల్లి పంచాయతీ పరిధిలోని పిట్టల వారి పల్లి గ్రామాన్ని రాష్ట్ర వైఎస్ఆర్సిపి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మరియు రైల్వే కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజ రెడ్డి సందర్శించడం జరిగినది ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనను స్మశాన వాటిక చాలా దారుణంగా కంపచెట్లతో పీచు మొక్కలతో నిండిపోయినదని దానిని శుభ్రం చేయించవలసినదిగా గ్రామస్తులు ఆయనను కోరారు వారి కోరిక మేరకు స్పందించిన రామిరెడ్డి ధ్వజారెడ్డి తన సొంత నిధులతో అరుంధతి వాడ స్మశాన వాటికను జెసిబి యంత్రాలతో కంప చెట్లను పీచు మొక్కలను రాళ్లను శుభ్రం చేయించడం జరిగినది,ఈ నేపథ్యంలో పిట్టల వారి పల్లి గ్రామస్తులు పెద్దలు వృద్ధులు పిల్లలు అందరూ ఆయనకు ధన్యవాదములు కృతజ్ఞతలు తెలియజేశారు అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాల్సిందిగా వారిని కోరారు, ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థల బంధు విజయవంతం :పి డి ఎస్ యు

## పి డి ఎస్ యు డివిజన్ అధ్యక్షులు ఎండి ఇస్మాయిల్

**సంగారెడ్డి ప్రతినిధి జులై 10 ( ప్రజా) పబ్లిక్ న్యూస్ )**

వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంధు సంపూర్ణం ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్రంలో 27వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించాలనే ఆలోచనను మానుకోవాలి.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందించాలి.

మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి, అక్షయ పాత్ర, ఇస్కాన్, మన్నా సంస్థలకు కాకుండా మహిళా సంఘాలకు అప్పగించాలి.

ఖాళీగా ఉన్న టీచర్, వీజూా, ఐజూా మరియు లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలి.

ప్రైవేట్, కార్పోరేట్ విద్యావ్యాపారాన్ని అరికట్టి, ఫీజు నియంత్రణ చట్టం చేయాలి.

విద్యాహక్కు చట్టం అమలు చేసి, పేద విద్యార్థులకు 25% ఉచిత ప్రవేశాలు కల్పించాలి.

ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలలో విచ్చలవిడిగా తెరిచిన పుస్తకాలు, యూనిఫామ్, నోట్బుక్ విక్రయ కేంద్రాలను మూసివేయాలి.



పెండింగ్ స్కాలర్షిప్స్ మరియు ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేసి జి.ఓ నెం: 7,8,9 లను రద్దు చేయాలి.

ఇంటర్ కళాశాలలకు మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే ప్రారంభించి, నిధులు కేటాయించాలి.

అద్దె భవనాలలో నడుస్తున్న పాఠశాలలు, హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి. అన్నారు ఇప్పటికైనా ఈ ప్రభుత్వం నిద్రమత్తు వదిలి విద్య రంగ సమస్యల పరిష్కరించాలని అన్నారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సంసిద్ధమవుతమని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శిఈ గోపాల్, నాయకులు రాకేష్, నరేందర్, రవి , సుమన్ ఎస్ఎఫ్ఐ నాయకులు

# కూల్ టెక్ సర్వీస్ సెంటర్ షాప్ ను ప్రారంభించిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)



**అందోల్ ప్రతినిధి జులై 10 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

జోగిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన కూల్ టెక్ సర్వీస్ సెంటర్ షాప్ ను అందోల్జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) శు భారంభం చేశారు. ఈ సందర్భంగా షాపు యజమాని మహమ్మద్ ను అభినందిస్తూ, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

కూల్ టెక్ సర్వీస్ సెంటర్లో ఏసీలు, ఫ్రిజ్లు, వాషింగ్ మెషీన్లు, కూలర్లు, మిక్సీలు, ఫ్యాన్లు తదితర ఎలక్ట్రికల్ పరికరాలకు రిపేర్ సేవలు అందుబాటులో ఉంటాయని యజమాని మహమ్మద్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అర్పుత్, కౌన్సిలర్ అనిల్, టీ వై జె ఎఫ్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆబేద్,మీర్ గోహార్ అలీ, ఫెరోజ్, నయీమ్, బాబా, మొఖోధర్ ఖాన్, చోటు ఖాన్ స్థానిక ప్రముఖులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు మరియు ప్రజలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.






# జోగిపేట 10వ వార్డులో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీఓ రమేష్బాబు,

## మున్సిపల్ కమిషనర్ తిరుపతి

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 10( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) ప్రక్రియను శు క్రవారం ఆర్డీఓ రమేష్బాబు మరియు మున్సిపల్ కమిషనర్ తిరుపతి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఇంటింటికి వెళ్లి జరుగుతున్న ప్రక్రియను తనిఖీ చేసి, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నిబంధనల ప్రకారం నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ముస్సిపల్ వైస్ చైర్మన్ను మర్యాదపూర్వకంగా కలిసిన టీవైజేఎఫ్ అందోల్ నియోజకవర్గ యూనియన్ సభ్యులు

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జులై 10 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**



తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీవైజేఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ ఆధ్వర్యంలో అందోల్ నియోజకవర్గ యూనియన్ సభ్యులు మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు రాజు, కోశాధికారి నాగరాజ్ తో పాటు ఇతర సభ్యులు పాల్గొని జ్ఞాపికను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. జర్నలిస్టుల సంక్షేమం, సంస్థ బలోపేతం, భవిష్యత్ కార్యక్రమాలపై పరస్పరం చర్చించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొని మున్సిపల్ వైస్ చైర్మన్కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# 107 పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న తల్లెం భరత్ కుమార్ రెడ్డి.









**రైల్వే కోడూరు జూలై 10 రిపబ్లిక్ న్యూస్.**

ఆదివారంతో సమయం ముగుస్తున్నందున ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న రాయలసీమ జోనల్ వైఎస్ఆర్సిపి కన్వీనర్ కల్లెం భరత్ కుమార్ రెడ్డి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ తగు సూచనలు చేశారు, రైల్వే కోడూరు మండలం ఉప్పరపల్లి 107 పోలింగ్ బూత్ నందు ఓటరులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది, సందర్భంగా కల్లెం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వాటర్లో ఎలాంటి అనుమానాలు ఉన్న మా దృష్టికి గాని సంబంధిత అధికారుల దృష్టికి అని తీసుకెళ్లి మీ సమస్యను పరిష్కరించుకోవాలని కల్లెం భరత్ కుమార్ రెడ్డి ఓటర్లకు సూచించారు,సర్ కార్యక్రమం ద్వారా ఎన్యూమరేషన్ పత్రాలను ఎలా పూరించాలి అనే విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కోడూరు మండల పరిధిలోని ఉప్పరపల్లి 107 పోలింగ్ కేంద్రం ముందు శుక్రవారం సర్ కార్యక్రమంలో భాగంగా వైసిపి పార్టీ రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు, డి ఆర్ యు సి సి సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి మరియు వైసీపీ పార్టీ సీనియర్ నాయకులు మాదినేని వెంకటరెడ్డి లు పర్యటించి ఆ పోలింగ్ కేంద్రంలోని ఓటర్లకు సర్ కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సర్ కార్యక్రమం ద్వారా ఉప్పర పల్లి గ్రామపంచాయతీలో గత కొద్దిరోజులుగా సర్ కార్యక్రమం లో భాగంగా ఓటర్లకు సర్ కార్యక్రమం ఏ విధంగా ఓటర్లకు ఉపయోగపడుతుంది అలాగే ఎన్యుమరేషన్ పత్రాలు ద్వారా ఎలా వారి యొక్క వ్యక్తిగత ఓట్లను ఎలా పునరుద్ధరించుకోవాలి అనే విషయాలపై పూర్తిస్థాయిలో ఓటర్లకు అవగాహన కల్పించి పూరించినటువంటి పత్రాలను బి ఎల్ ఓ లకు అందజేసి అంతర్జాలం ద్వారా నమోదు చేయించి వారు ఓటును పునరుద్ధరించుకొని తద్వారా ఓటును రానటువంటి ఎన్నికలలో ఉపయోగించుకునే విధంగా ఉండాలని తెలియపరచడం జరిగిందన్నారు అంతే కాకుండా ఓటర్లకు అవగాహన కల్పించి తమ ఓటు హక్కును

కాపాడుకునే విధంగా మేమంతా సటమిష్టిగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన ఓటర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఎ లు బి ఎల్ ఓ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# జగిత్యాల నుండి నిర్మల్ వెళ్తున్న బస్సులో అల్లిపూర్ మహిళది రెండు తులాల బంగారం అపహరణ

**రాయికల్ పట్టణం జూలై 10( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల నుండి నిర్మల్ వెళ్తున్న బస్సులో రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన మహిళది 2 తులాల బంగారం అపహరణకు గురైనట్లు వెల్లడిస్తున్న మహిళ మహిళా తన స్వగ్రామం అల్లిపూర్ లో దిగగానే బంగారం లేదని రాయికల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు రాయికల్లో ఇటిక్యాల క్రాసింగ్ వద్ద బస్సు ఆపి తనిఖీలు చేపట్టారు. ఇప్పటికైనా బస్సులో వెళ్లే మహిళలు విలువైన వస్తువులు వెంట తీసుకువెళ్లద్దని అపరిచితులను నమ్మరాదని పోలీసులు చెప్తున్నారు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




# ప్రజాసేవలో ఎంపీటీసీ బండారు మల్లికార్జున

## సొంత నిధులతో ట్యాంకర్ ద్వారా గ్రామానికి తాగునీటి సరఫరా.

**రైల్వే కోడూరు జూలై 10 రిపబ్లిక్ న్యూస్.**

అనంతరాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డేపల్లి బీసీ కాలనీ మిట్టమీద పల్లిగ్రామంలో తాగునీటి సమస్య తలెత్తడంతో ఎంపీటీసీ బండారు మల్లికార్జున మానవతా దృక్పథంతో ప్రజా సమస్యల పరిష్కార దిశగా వెంటనే స్పందించి సొంత నిధులతో ట్యాంకర్ ద్వారా గ్రామానికి తాగునీటిని సరఫరా చేశారు.

గ్రామంలోని తాగునీటి మోటారు గత కొద్ది రోజులుగా పనిచేయకపోవడంతో త్రాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో మెకానిక్ను పిలిపించి పరిశీలించగా, మోటర్ ప్రాబ్లం వచ్చినట్లు గుర్తించారు. దీంతో మరమ్మతులకు సమయం పట్టే పరిస్థితి ఏర్పడటంతో గ్రామ ప్రజలకు



ఇబ్బందులు కలగకుండా ఎంపీటీసీ బండారు మల్లికార్జున తన సొంత ఖర్చుతో ట్యాంకర్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటిని అందేలా ఏర్పాట్లు చేశారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, సమస్య తెలిసిన వెంటనే స్పందించి తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్న ఎంపీటీసీ బండారు మల్లికార్జునకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటారని, ఆయనలాంటి ప్రజాసేవకుడు రాజకీయాల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి గ్రామాభివృద్ధికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు మల్లికార్జునతో పాటు గ్రామ పెద్దలు, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోపణలు నిజమని నిరూపిస్తే గుంతకల్లు విడిచి వెళ్తా

## : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**అనంతపురం/గుంతకల్లు, జూలై 10 ( రిపబ్లిక్ న్యూస్)**

మస్తానయ్య దర్గా అభివృద్ధి విషయంలో తనపై చేసిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే గుంతకల్లు నియోజకవర్గాన్ని విడిచి వెళ్లేందుకు సిద్ధమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సవాల్ చేశారు. శుక్రవారం మస్తానయ్య దర్గాను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ

దర్గా అభివృద్ధి కోసం వక్ఫ్ బోర్డు ద్వారా రూ.2.50 కోట్లతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నానని తెలిపారు. ఈ క్రమంలో వక్ఫ్ బోర్డు నిబంధనలకు సంబంధించిన అంశాలపై ముస్లిం నాయకుడితో జరిగిన సంభాషణను కొందరు వక్రీకరించి, తనపై తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. దర్గా అభివృద్ధి కోసం జరిగిన చర్చను తనకు వాటా కోరినట్లుగా చిత్రీకరించడం దురుద్దేశపూర్వకమని అన్నారు.



తాను గుంతకల్లు నియోజకవర్గంలో విజయం సాధించడంలో మస్తానయ్య దర్గా, నెట్టికంటి ఆంజనేయస్వామి ఆశీస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో దర్గా అభివృద్ధిపై ఎవరూ దృష్టి సారించలేదని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. దర్గా అభివృద్ధికి రూ.2.50 కోట్లతో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి మరో రూ.1.50 కోటి సమకూర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎలాంటి అసత్య ప్రచారాలు జరిగినా దర్గా అభివృద్ధిని పూర్తి చేసి చూపిస్తామని, ప్రజల మద్దతు తనకు ఉందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు.

కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జగిత్యాల జిల్లాలో జనసేన పార్టీ ఎంపీటీసీ జెడ్పిటిసిల ఎన్నికల్లో పోటీ

## - జగిత్యాల ఇంచార్జ్ బెక్కమ్ జనార్ధన్



**రాయికల్ పట్టణం జూలై,10 ( రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో పాల్గొన్న జోష్ తో జెడ్పిటిసి ఎంపిటిసిల ఎన్నికల్లో పాల్గొంటుందని జనసేన జగిత్యాల్ ఇన్చార్జ్ బెక్కమ్ జనార్ధన్ తెలిపారు తెలంగాణలో బలమున్న జనసేన పార్టీ జగిత్యాల నియోజకవర్గంలో అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని జనం కోసం పుట్టిన పార్టీ జనసేన అందుకే ప్రజలకు సేవ చేయాలని మా నాయకులు ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఈసారి ఎంపీటీసీ జడ్పిటిసి ల ఎన్నికల్లో పాల్గొంటామని ఆయన అన్నారు ప్రజలకు మంచి చేయాలని ఉద్దేశంతో పార్టీ స్థాపించి ఈసారి ఎంపీటీసీ జెడ్పీటీసీల ఎన్నికల్లో పాల్గొని అధిక స్థానాలు గెలుచుకుంటామని ఎవరైనా పని చేసే అభ్యర్థిని ఎన్నుకుంటారని అందుకొరకై మా పార్టీ ప్రజల అవసరాలు తీర్చడానికి సిద్ధంగా ఉందని అందుకే ఈసారి ఎంపీటీసీ జడ్పిటిసి ల ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని ప్రజలు మాకు మద్దతిచ్చి మాకు ఓటు వేసి మీ పనులను చేయించుకోవాలని అదికాక గెలిచినా ఓడిన మీకు సేవ చేయడానికి వుంటామని ఆయన అన్నారు మా పార్టీ ప్రజలతో ఉండే పార్టీ అందుకే మేము గెలిచినా ఓడిన ప్రజలతోనే కలుస్తాం ఈ కార్యక్రమంలో రాయికల్ నుండి కాశ వేణి మల్లికార్జున్. బత్తిని బాబు గౌడ్. చౌహన్ శ్రీనివాస్. కార్తీక్. అల్లే పవన్. మరియు కార్యకర్తలు వీర మహిళలు పాల్గొన్నారు

# రాయికల్ మూడో వార్డు లో మౌలిక వసతులు కల్పించండి : గోవర్ధన్ చారి వినతి



**రాయికల్ పట్టణం జూలై,10( రిపబ్లిక్ న్యూస్)**జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం మూడో వార్డులో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని మూడో వార్డు నాయకుడు గోవర్ధన్ చారి ఆధ్వర్యంలో ఈరోజు రాయికల్ మున్సిపల్ మేనేజర్ బి వెంకటి కి వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము రాయికల్ పట్టణ వాసులశీ మా వార్డు మూడో వార్డు లో కనీసం సిసి రోడ్లు గాని మురికి కాలువలు గాని నీటి కొరకై నల్లలు కూడా లేవని ఆవేదనాతో చెప్పారు కనీసం మౌలిక వసతులైన ఏర్పాటు చేయాలని అధికారులను పాలకమండలిని కోరుతున్నారు

# రాయికల్లో బంద్ అయిన డిగ్రీ కాలేజీని తిరిగి ప్రారంభించేందుకు ప్రజా ప్రతినిధులు ముందుకు రావాలి!!

## -విద్యార్థులు విన్నపం

**రాయికల్ పట్టణం జులై,10 ( రిపబ్లిక్ న్యూస్):**విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో గతంలో డిగ్రీ కాలేజీ ప్రారంభించి తిరిగి కాలేజీ బంద్ కావడం విద్యార్థులు విద్యను అభ్యసించకపోవడం జరిగిశీది పైచదువుల కొరకై రాయికల్ మండలం నుండి దాదాపు హైదరాబాద్, కరీంనగర్,జగిత్యాల్,కోరుట్ల, హనుమకొండ, వరంగల్, విజయవాడ కు విద్యార్థులు పై చదువుల కొరకు పోవడం జరుగుతుంది రాయికల్ పట్టణంలోకి దాదాపు 60 గ్రామాల ప్రజలు ఇక్కడ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తే అందరికి ఆమోదయోగ్యశీగా ఉంటుందని గతంలో కాలేజీ గురిశీచి రాయికల్ యువజన నాయకులు నిరాహార దీక్షలు చేసి డిగ్రీ కాలేజీని సాధించారు సాధించిన కొద్ది నెలల్లోనే కాలేజీ బంద్ కావడం విద్యార్థుల్లో యువజన నాయకుల్లో నిరుత్సాహం ఏర్పడింది వారు ఎన్నో ప్రయత్నాలు చేసి వారికి గ్రామ ప్రజాప్రతినిధులు నాయకులు సహకరించకపోవడం దురదృష్టం ఓట్లప్పుడు ఎన్నికల అప్పుడు ఎన్నో లక్షలు ఖర్చు చేస్తారు కానీ పట్టణ అభివృద్ధికి మాత్రం ఏ నాయకుడు ముందుండడు!! ఇప్పటికైనా రాయికల్ ప్రజాప్రతినిధులు ఒక పట్టణ అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీ ద్వారా డిగ్రీ కాలేజీని సాధించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు

# టియుడబ్ల్యూ జిల్లా ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీగా బోడ సుమన్





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూలై 10( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజెయూ) సంగారెడ్డి జిల్లా ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీగా జోగిపేటకు చెందిన 6టీవీ రిపోర్టర్ బోడ సుమన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 9న సంగారెడ్డిలో నిర్వహించిన (టియుడబ్ల్యూజెయూ) జిల్లా మహాసభలో జరిగిన జిల్లా కమిటీ ఎన్నికల్లో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా బోడ సుమన్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి పదవి అప్పగించిన జిల్లా జర్నలిస్టులు, సంఘ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంఘ బలోపేతం, సభ్యుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. ప్రతి జర్నలిస్టుకు అందుబాటులో ఉంటూ సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు విరాత్ అలీ, నాయకుడు పైసల్ అహ్మద్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, జాతీయ కార్యవర్గ మాజీ సభ్యుడు వెంకటరెడ్డితో పాటు జిల్లా జర్నలిస్టులందరికీ ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు బోడ సుమన్‌ను అభినందించారు.

# చల్‌గల్‌లో కేంద్ర విద్యాలయానికి 5 ఎకరాల భూమి కేటాయింపు బీజేపీ పోరాట ఫలితమే!!

-మరో 5 ఎకరాలు స్థలం కోసం ఉద్యమిస్తాం.విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగుతుంది

- ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం -బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ భోగ శ్రావణి.

**రాయికల్ పట్టణం జులై,10 ( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చల్‌గల్ వాలంతరీ సెంటర్‌లో ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.158ను బీజేపీ స్వాగతిస్తున్నట్లు బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. భోగ శ్రావణి తెలిపారు
విద్యార్థుల భవిష్యత్తు, ధర్మం, న్యాయం కోసం బీజేపీ చేసిన పోరాటానికి దక్కిన ఫలితమే ఈ నిర్ణయమని అన్నారు. శుక్రవారం కమల నిలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రావణి మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చల్‌గల్ వాలంతరి సెంటర్ ప్రాంతమే అనుకూలమని కేంద్రియ విద్యాలయ సంఘటన్ అధికారులు గుర్తించారని అన్నారు. అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెబుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కారణంగానే సంవత్సరం కాలయాపన జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్వార్థపూరితంగా తనకు భూములు ఉన్న చోట కెవి ఏర్పాటుకు స్థలాలు ప్రతిపాదించిండని స్థల పరిశీలనకు వచ్చిన అధికారులు వాటిని తిరస్కరించినట్లు గుర్తు చేశారు. కేంద్రీయ విద్యాలయాన్ని చల్‌గల్ లోనే ఏర్పాటు చేయాలని ఎంపీ ధర్మపురి అరవింద్ చేపట్టిన నిరాహార దీక్షను ఎమ్మెల్యే పోలీసులతో అడ్డుకోవడమే కాకుండా బీజేపీ మహిళా నాయకులని కూడా చూడకుండా అరెస్టు చేసి చేయించి లాక్కెల్లేలా చేసారని





ఆరోపించారు. అయితే చివరికి బీజేపీ నాయకుల పోరాట ఫలితంగా విద్యార్థుల ప్రయోజనాలే గెలిచాయని వ్యాఖ్యానించారు కాగా ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయించడం స్వాగతించదగ్గ నిర్ణయమే అయినప్పటికీ, పూర్తి స్థాయి కేంద్రీయ విద్యాలయానికి 10 ఎకరాల స్థలం అవసరమని శ్రావణి అభిప్రాయపడ్డారు. క్రీడా మైదానం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతర మౌలిక వసతుల కోసం అదనంగా మరో ఐదు ఎకరాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జూలై 12న ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో కేవీ ఏర్పాటు కు భూమిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కేంద్రీయ విద్యాలయం మంజూరుకు కృషి చేసిన ఎంపీ అరవింద్‌తో పాటు, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భూమి కేటాయింపుకు సహకరించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు పార్టీ నాయకులు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత,42వ వార్డ్ కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, జిల్లా కార్యదర్శులు పాత రమేష్, ముత్యంరెడ్డి, కాశెట్టి తిరుపతి,పూదరి శ్రీనివాస్, బద్దెల గంగరాజం మరియు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికతో కృషి చేయాలి

## అదనపు కలెక్టర్ నగేష్





**మెదక్ జిల్లా ప్రతినిధి జులై 10 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి సర్పంచ్ లు స్థానిక అవసరాలను గుర్తించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. గురువారం జిల్లాలోని నర్సాపూర్ మరియు తూప్రాన్ డివిజన్‌లలోని 248 గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులందరితో నర్సాపూర్‌లోని బి వి ఆర్ లో గ్రామ పంచాయతీ అభివృద్ధి సమగ్ర ప్రణాళికిక, వీబీజీరాంజీ , జల సిరి, ఓ ఎస్ ఆ నియమాలు, 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలు మరియు ఇతర ముఖ్యమైన అంశాలపై ఒక రోజు అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ అవగాహన కార్యక్రమానికి జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య డిఎల్పిఓ తూప్రాన్ డి ఎల్ పి ఓ నర్సాపూర్ తూప్రాన్ నరసాపూర్ మండలాల ఎంపీడీవోలు ఎంపీలు అందరు సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు ఆర్డబ్ల్యూఎస్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ నగేష్ హాజరవడం జరిగింది.
. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో సర్పంచ్ లు, వార్డు సభ్యుల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను అందుబాటులో ఉన్న వనరులతో పరిష్కరించే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీలకు లభించే 15వ, 16వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, వి బి జి రామ్ జీ పథకం తదితర వనరులను సమర్థవంతంగా వినియోగించి గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పెరుగుతున్న వీధి కుక్కల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు జంతు పునరుత్పత్తి నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పశువైద్య శాఖ ద్వారా శస్త్రచికిత్సలు, యాంటీ రేబిస్ టీకాలు ఉచితంగా అందుబాటులో ఉంటాయని, గ్రామ పంచాయతీలు కుక్కలను పట్టుకోవడం, సంరక్షణ వంటి అంశాలపై దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని తెలిపారు. మురుగునీటి వ్యవస్థలు, ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ హాళ్లు, త్రాగునీటి సరఫరా, సౌర విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి పనులకు ప్రభుత్వ పథకాలలో ప్రత్యేక నిధులు అందుబాటులో ఉన్నాయని, ఆయా పథకాల మార్గదర్శకాల ప్రకారం ప్రతిపాదనలు రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ఉపాధి హామీ, విబి జి రామ్ జీ పథకాల క్రింద చేపట్టిన పనులకు చెల్లింపులు నిర్ణీత గడువులో జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, సకాలంలో సమర్పించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులను ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగించాలని, నిధుల దుర్వినియోగం, మళ్లింపు జరిగినట్లయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం, మహిళా సంఘాల భవనాలు, ఇతర ప్రాధాన్యత కలిగిన మౌలిక వసతుల నిర్మాణానికి అవసరమైన భూమి, పరిపాలనా అనుమతులు జిల్లా యంత్రాంగం నుంచి అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. 5 ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు కూరగాయల సాగు కోసం పందిళ్ల ఏర్పాటు, బీటీ రహదారులు, మ్యాజిక్ డ్రైన్లు, సౌర విద్యుత్ ఆధారిత వీధి దీపాలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాలలో చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా యంత్రాంగం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని, అభివృద్ధి కార్యక్రమాల్లో సర్పంచ్ లు చొరవ తీసుకుని గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలి

## కలెక్టర్ ప్రతిమాసింగ్

## క్షేత్రస్థాయిలో సర్ నిర్వహణ పై ఆర్డీవోలకు తాసిల్దారులకు గూగుల్ మీట్ నిర్వహణ

## మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్

**మెదక్ జిల్లా ప్రతినిధి జులై 10( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
: పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తూ, నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. ఎస్ఐఆర్ లో భాగంగా కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ క్షేత్రస్థాయిలో సర్ నిర్వహణ పై ఆర్డీవోలకు తాసిల్దారులకు గూగుల్ మీరు ద్వారా ఆమె సమీక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను జిల్లాలో పారదర్శకంగా చేపట్టాలని ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ వివరాల, నమోదు ఇప్పటివరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఎంత శాతం పూర్తయ్యింది, ఓటర్లు అందరికీ ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ పూర్తయిందా తదితర
వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో లేని ఓటర్లకు కూడా సమాచారం అందించాలని, గడువు లోపు వారు తమ ఎన్యూమరేషన్ ఫారంలు తిరిగి అందించేలా చూడాలన్నారు. జీవనోపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారి ఎన్యూమరేషన్ ఫారంలను జాగ్రత్తగా పరిశీలించాలని, వివరాలు సరి చూసుకున్న మీదట వారి కుటుంబ సభ్యుడి సంతకంతో తీసుకోవచ్చని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వివరాల డిజిటలైజేషన్ ను ఏకకాలంలో సమాంతరంగా నిర్వహించాలని అన్నారు.



ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలో పొందుపర్చిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా నిర్ధారణ చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.. ఓటర్లతో మర్యాదపూర్వకంగా మెలగాలని, ఓటరు మ్యాపింగ్ విషయంలో సహకారం అందించాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ దగ్గర ఓటరు జాబితా తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డబుల్ ఓట్లు కలిగిన వారిని గుర్తిస్తూ, ఓటరు జాబితాలో మార్కింగ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాగా, సకాలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లు బీఎల్ఓ లకు తగిన సహకారం అందించాలని అందించాలన్నారు.
ఈ కార్యక్రమంలో , మెదక్ ఆర్డిఓ రమాదేవి, ఎన్నికల సూపరిండెంట్ గఫార్, ఆర్డీవోలు, తాసిల్దారులు ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు ఉన్నారు.



# ఎన్ఐఏ కేసుల విచారణ కు ప్రత్యేక కోర్టు ఏర్పాటు

**మంత్రివర్గ సమావేశంలో ఆమోదం**

**హైకోర్టులో "రిజిస్ట్రార్" ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా గ్రీన్ సిగ్నల్**

**న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**



**అమరావతి, జులై 10( రిపబ్లిక్ న్యూస్) :** జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణ కోసం విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన ప్రతిపాదనలకు ఆమోదం లభించిన విషయాన్ని మంత్రి ఫరూక్ వెల్లడించారు.జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం, 2008 కింద నమోదయ్యే కేసులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులను ఏర్పాటు చేయాలని భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలకు ఆదేశించినట్లు ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో విజయవాడ, విశాఖలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం రెండు నోటిఫై చేసిన కోర్టులు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.కాగా రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 20 ఎన్ఐఏ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 19 కేసులు విశాఖపట్నంలోని 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టులో, విజయవాడలోని 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టులో ఒక కేసు పెండింగ్‌లో ఉందన్నారు.విశాఖలో ఎన్ఐఏ కేసుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం పరిధిగా ఉండేలా విశాఖలో జిల్లా మరియు సెషన్స్ జడ్జి స్థాయిలో ఒక ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేయడం అవసరమని హైకోర్టు అభిప్రాయపడిందన్నారు. విశాఖలో జిల్లా మరియు సెషన్స్ జడ్జి స్థాయిలో ఒక ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేయడం, ఆ కోర్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం పరిధిగా ఉండేలా నిర్ణయించడం, అలాగే దీనిని నిర్వహించడానికి ఒక స్పెషల్ జడ్జితో సహా మొత్తం 16 మంది సిబ్బందిని కేటాయించాలని చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం జరిగిందన్నారు.

**హైకోర్టులో "రిజిస్ట్రార్" ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా గ్రీన్ సిగ్నల్**

రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో జిల్లా న్యాయమూర్తి స్థాయికి చెందిన, రెగ్యులర్ ప్రాతిపదికన రిజిస్ట్రార్ ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించిందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. సుప్రీంకోర్టు సుమోటో రిట్ పిటిషన్ (క్రిమినల్)నెంబర్–4/2021 లోని ఆదేశాలు, సుప్రీంకోర్టు 'కేస్ ఫ్లో మేనేజ్‌మెంట్ కమిటీ' చేసిన సిఫార్సుల మేరకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోని 'స్టేట్ కోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ కమిటీ'కి చెందిన న్యాయమూర్తులు రాష్ట్ర హైకోర్టులో జిల్లా న్యాయమూర్తి స్థాయికి సమానమైన 'రిజిస్ట్రార్ (కోర్ట్ అండ్ కేస్ మేనేజ్‌మెంట్)' పోస్టును సృష్టించాలని నిర్ణయించిన మేరకు ప్రభుత్వం రిజిస్ట్రార్ పోస్టు సృష్టికి ఆమోదం తెలపడం జరిగిందన్నారు. కొత్త పోస్టు ఏర్పడటం వల్ల జిల్లా న్యాయస్థానాలలో పెండింగ్ కేసులను తగ్గించేదుకు వీలు కలుగుతుందని న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందజేత

**కుమార్తెల విద్యాభ్యాసానికి ముఖ్యమంత్రి చేయూత**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూలై 10( రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన బనగానపల్లె పర్యటన సందర్భంగా విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం కోరిన కుటుంబానికి మంజూరు చేసిన రూ.2 లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పేద మరియు అవసరమైన కుటుంబాల పిల్లల ఉన్నత విద్యాభ్యాసానికి అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. 9న బనగానపల్లె మండలంలో నిర్వహించిన "మీ భూమి – మీ హక్కు" కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో పాల్గొన్న సందర్భంగా బేతంచర్ల మండలం గూటుపల్లె గ్రామానికి చెందిన కాదారమ్మ లక్ష్మి తన కుమార్తెల విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. ఆ వినతిపై సానుకూలంగా స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి, కుమార్తెల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇస్తూ తక్షణమే అవసరమైన సహాయం అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కుమార్తెల విద్యాభ్యాసం కోసం రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల కుటుంబానికి అందజేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. విద్య ద్వారానే కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతాయని, ప్రతి విద్యార్థి తన లక్ష్యాలను సాధించేలా ప్రభుత్వం అవసరమైన సహకారాన్ని అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్, డోన్ ఆర్డీఓ నరసింహులు, బేతంచర్ల తహశీల్దార్ నాగమణి తదితర అధికారులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం

**. రావుస్ కళాశాలలో బాలికలకు వక్తృత్వ పోటీల నిర్వహణ**

**. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు రావుస్ కళాశాలల చైర్మన్ అప్పారావు, డైరెక్టర్ మౌని చంద్ర సౌజన్యంతో నిర్వహణ**




**నంద్యాల జూలై 10 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని,శుక్రవారం బాలాజీ కాంప్లెక్స్ లో ఉన్న రావుస్ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన,కార్యదర్శి మేడా చంద్రశేఖర్ నిర్వహణలో,రావుస్ కళాశాలల చైర్మన్ అప్పారావు, డైరెక్టర్ మౌని చంద్ర సౌజన్యంతో జరిగిన ఒక కార్యక్రమంలో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ "యువత ఆశలు,ఆశయాలు నేడు, భవిష్యత్తులో నెరవేరాలని" ఈ సంవత్సరం ప్రపంచ జనాభా దినోత్సవ నినాదమని తెలిపారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ జనాభా నిరంతరం పెరుగుతున్నదని, భూమి స్థిరంగా ఉంటుందని,వనరులు అందరికీ అందుబాటులోకి తేవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కర్తవ్యం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో అధిక జనాభాని మానవ వనరులుగా అన్ని రంగాలలో వినియోగించుకుని దేశాన్ని ముందుకు తీసుకుపోవాల్సిన ఆవశ్యకత నేడు ఉందని అన్నారు.

ఈ సందర్భంగా "అధిక జనాభా అనర్థదాయకమా,ప్రయోజనకరమా" అన్న అంశంపై జరిగిన వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్,రావుస్ కళాశాలల ప్రిన్సిపల్స్ గా ఉన్న సుంకయ్య, సంగమేష్, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ నిజాముద్దీన్,జోన్ చైర్మన్ సోమేశుల నాగరాజు, సభ్యులు కన్నయ్య,రత్నకుమార్, ఆరవేటి రఘు,పాలూరి ప్రశాంత్, పోలూరు జనార్ధన్, కిరణ్ లాల్, కళాశాల బాలికలు పాల్గొన్నారు.

**వక్తృత్వ పోటీ విజేతలు:**

కలిమా,ఆస్మా తబసుం, సింధు వరుసగా ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించగా అక్షయ దేవి,వైష్ణవి,హాఫీజ ప్రోత్సాహక బహుమతులు సాధించారు.

# నేడు విజయవాడలో మైనారిటీ యువత కోసం రాష్ట్రస్థాయి మెగా జాబ్ మేళా

**సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చిన మంత్రి ఫరూక్**

**అమరావతి, జులై 10 (రిపబ్లిక్ న్యూస్):** విజయవాడలో నిరుద్యోగ మైనారిటీ యువత కోసం రాష్ట్రస్థాయి మెగా జాబ్ మేళా ను ఈనెల 11వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు మైనారిటీ,న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇస్లాం పేట లోని షాజహూర్ ముసాఫిర్ ఖానాలో ఉదయం 9 గంటల నుండి జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ మైనారిటీ యువత కోసం, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రఖ్యాతిగాంచిన 60 నుండి 70 మల్టీ నేషనల్ సంస్థలు, డోమెస్టిక్ కంపెనీలు పాల్గొంటున్నట్లు మంత్రి తెలిపారు. ఐటి , బ్యాంకింగ్ , ఫైనాన్స్, హెల్త్ కేర్,లాజిస్టిక్స్, రిటైల్ తదితర రంగాలలో వివిధ స్థాయిలలో 2500 నుండి 3500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే జాబ్ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు.10 వ తరగతి నుండి పీజీ దాకా చదివిన నిరుద్యోగులంతా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు.

# " సినిమా" చూపించిన "దొంగ" అరెస్ట్

**రూ.5.25 లక్షల నగదు,కారు స్వాధీనం -వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పి**



**అనంతపురం క్రైమ్,జూలై 10,(రిపబ్లిక్ న్యూస్):** సినిమాల ప్రభావంతో 'దూమ్' తరహాలో షాపింగ్ మాల్స్‌లో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేరస్థుడు "సినిమా" చూపించిన "దొంగ" ను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ మహబూబ్ బాష వివరాలను వెల్లడించారు.గత నెల 21న అనంతపురంలోని డ్రెస్ సర్కిల్‌కాంచీపురం షాపింగ్ మాల్‌లో జరిగిన చోరీ ఘటనపై ఫిర్యాదు అందిన వెంటనే ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో బెంగళూరుకు చెందిన నాగరాజు అలియాస్ ఆనంద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

**షాపింగ్ మాల్స్‌ను లక్ష్యంగా మాస్క్ ధరించి చోరీలు**

నిందితుడి వద్ద నుంచి రూ.5.25 లక్షల నగదు, చోరీలకు వినియోగించే ఇనుప రాడ్లు, వాహనాల నెంబర్ ప్లేట్లు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితుడిపై ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మొత్తం 32 క్రిమినల్ కేసులు నమోదైనట్లు గుర్తించామని అదనపు ఎస్పీ తెలిపారు. షాపింగ్ మాల్స్‌ను లక్ష్యంగా చేసుకుని రాత్రివేళల్లో మాస్క్ ధరించి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. అందులో భాగంగా నేరస్తుడు 'దూమ్' సినిమా ప్రభావంతో అదే తరహా పద్ధతులను అనుసరిస్తూ నేరాలకు పాల్పడేవాడని, సినిమాలపై మోజుతో సంపాదించిన డబ్బును వృథా చేసుకుని మళ్లీ చోరీలకు పాల్పడుతున్నారన్నారు. గతంలో హత్య కేసులో నిందితుడు అని, అయితే వరుస దొంగతనాలకు పాల్పడుతూ అంతర్రాష్ట్ర నేరస్థుడిగా మారాడని పోలీసులు వెల్లడించారు. దర్యాప్తు చేపట్టిన ఒకటో పట్టణ పోలీసులు, సిసిఎస్ పోలీసులు బృందాలుగా ఏర్పడి నాగరాజు అలియాస్ ఆనందం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు అదనపు ఎస్పి మహబూబ్ బాషా తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**ఈ నెల 12వ తేదీలోపు క్షేత్రస్థాయి తనిఖీలు పూర్తి చేయాలిద -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూలై 10( రిపబ్లిక్ న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి దశను నాణ్యతతో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎన్నికల నమోదు అధికారులు సహాయ ఎన్నికల నమోదు అధికారులు తక్కువ పురోగతి సాధించిన బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశంలోని ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించడం ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అదే సమయంలో ఓటు హక్కు దుర్వినియోగానికి అవకాశం లేకుండా, ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటర్ల జాబితాలో నమోదైన మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు నివాసం మార్చుకున్న వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదైన (డబుల్ ఎంట్రీలు) ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. బూత్ లెవల్ ఏజెంట్ (దీూూ) ధృవీకరణతో పాటు అవసరమైన క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి, అర్హత లేని నమోదులను ఈ నెల 12వ తేదీలోపు తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఎన్యూమరేషన్ ఫారాలను త్వరితగతిన సేకరించాలని, సేకరించిన ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజేషన్ చేయాలని బీఎల్ఓలను ఆదేశించారు. ఎక్కడా పెండింగ్ లేకుండా ప్రతిరోజూ లక్ష్యాలను పూర్తి చేస్తూ పురోగతిని నమోదు చేయాలని, ఈ ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతం కావాలంటే క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా ధృవీకరించి, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ఎమ్మెల్యే కాలువ వినతుల స్వీకరణ**



**అనంతపురం / కనేకల్ , జూలై 10,( రిపబ్లిక్ న్యూస్):** మండల ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి వేగవంతమైన పరిష్కారం చూపాలనే లక్ష్యంతో కనేకల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు తాగునీరు, రహదారులు, పింఛన్లు, గృహాలు, భూ సమస్యలు, విద్యుత్, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ప్రతి వినతిని ఎమ్మెల్యే ఓర్పుతో విని, సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం చూపే వేదికగా ప్రజాదర్బార్ నిలుస్తోందని, భవిష్యత్తులో కూడా ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

# 99.97 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశాం

**74.18 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి**

**ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్ ను నియమించుకోవాలి**

**కొత్తగా 134 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు**

**స్థల మార్పిడికి 45, పేరు మార్పులకు 13 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూలై, 10 (రిపబ్లిక్ న్యూస్):** ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ) ప్రక్రియలో భాగంగా 99.97 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశామని తిరిగి ఇచ్చిన ఫారాలను 74.18 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ)పై రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిఆర్ఓ రామునాయక్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు బిజెపి పార్టీ ప్రతినిధి కె.చంద్రశేఖర్, టిడిపి పార్టీ ప్రతినిధి ఎం.రామ్మోహన్, వైఎస్సార్సీసీపీ పార్టీ ప్రతినిధి సాయిరామ్ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ప్రదీప్, జనసేన పార్టీ ప్రతినిధి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ) ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. బిఎల్ఓ, బిఎల్ఏ సమన్వయంతో పని చేయడం ద్వారా ఓటర్లకు ఎస్ఐఆర్ పై అవగాహన కల్పిస్తూ త్వరితగతిన పూర్తి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో 1200 ఓటర్లకు మించి ఉండకూడదనే నిబంధనలో భాగంగా కొత్తగా 134 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1629 పోలింగ్ కేంద్రాలు ఉండడం జరిగిందని వాటిలో ఆళ్లగడ్డలో 298 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 14 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు (పోలింగ్ కేంద్రాల స్థల మార్పిడికి 9) మొత్తంగా 312 పోలింగ్ కేంద్రాలు అవుతాయని, శ్రీశైలంలో 226 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 13 కొత్త పోలింగ్ కేంద్రాలు చేయగా (స్థల మార్పిడికి 8, పేరు మార్పిడికి 5) మొత్తంగా 239 అవుతాయని, నందికొట్కూరులో 251 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 25 పోలింగ్ కేంద్రాలు చేయగా (స్థల మార్పిడికి 1, పేరు మార్పిడికి 2) మొత్తంగా 276 అవుతాయని, నంద్యాలలో 286 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 48 కొత్త పోలింగ్ కేంద్రాలు చేయగా (స్థల మార్పిడికి 20, పేరు మార్పిడికి 6) మొత్తంగా 334 అవుతాయని, బనగానపల్లెలో 277 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 29 కొత్త పోలింగ్ కేంద్రాలు చేయగా మొత్తంగా 306 అవుతాయని, డోన్ లో 291 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్తగా 5 కొత్త పోలింగ్ కేంద్రాలు చేయగా (స్థల మార్పిడికి 7) మొత్తంగా 296 అవుతాయని రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. అదే విధంగా ఏ ఒక్క పోలింగ్ కేంద్రాలు కూడా ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com